భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0

నూజివీడు గోడు

ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్

తమను ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కలపాలని జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ముందు నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలు తమ డిమాండ్‌ను ముందుంచారు. అమరావతిలో ఈ రోజు జరిగే సమావేశంలో దీనిపై చర్చ జరగనుంది.

- అధికారుల సమీక్షల్లో ప్రజల సెంటిమెంట్‌ను వివరించే గొంతు కరువు
- అశాస్త్రీయ జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో చిక్కిపోయిన డివిజన్
- ఇప్పటికే జిల్లా కేంద్రానికి పలు ప్రభుత్వ కార్యాలయాల తరలింపు
- న్యాయస్థానాలు తరలిపోయే ప్రమాదం


మంత్రి సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న సిటిజన్ ఫోరం సభ్యులు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

ఒకప్పటి రాజుల సంస్థానాల్లో నూజివీడు ఒకటి. 14 మండలాలతో ఈ జమిందారీ సంస్థాన కేంద్రం ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రధాన కేంద్రంగా బాసిల్లింది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రలో అతి పెద్ద డివిజన్‌లలో ఇది ఒకటి. 2021లో ఒక్కసారిగా సీన్ మారింది. వైసీపీ సర్కార్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన జిల్లాలను విభజించింది. దీని ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగించాలని ప్రజలు కోరినా ఫలితం లేకపోయింది. దీనిని ఏలూరు జిల్లాలో కలిపారు. నాటి ప్రజా ప్రతినిధులు కనీసం నోరు మెదపలేదు.

ఈ క్రమంలో తమ సెంటిమెంట్‌ను గౌరవించి నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని 2024లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆయన రెండు సందర్భాల్లో సానుకూలంగా స్పందించారు. ఇటీవల పీ-4 కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆగిరిపల్లి వచ్చిన చంద్రబాబు ఆ హామీని పునరుద్ఘాటించారు. ఇంతవరకు బాగానే వుంది. కాని, జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ఏర్పాటు చేసిన కమిటీ ముందు నూజివీడు సెంటిమెంట్‌ను బలంగా ఉంచే నాథుడే కరువయ్యాడని నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. తమ సెంటిమెంట్‌ను బహిర్గతం చేస్తూ న్యాయవాదులు, వ్యాపార వర్గాలు రోడ్డుపైకి వచ్చాయి. గత వారం జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సమీక్ష జరగ్గా, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తూ అధికారుల వద్ద తమ వాదనను వినిపించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి తమ వాగ్ధాటిని వినిపించే గొంతుక కరువైంది. ఈ క్రమంలో నూజివీడు (మిగతా8వ పేజీలో)

మా సెంటిమెంట్‌ను గౌరవించండి

- మంత్రివర్గ ఉప సంఘానికి సిటిజన్ ఫోరం వినతి

నూజివీడు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు సిటిజన్ ఫోరమ్ ప్రతినిధులు జిల్లాల పునర్విభజన కమిటీ మంత్రివర్గ ఉపసంఘానికి విజ్ఞాపన పత్రాలను అందజేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలను కలిసి ఫోరమ్ ప్రతినిధులు పత్రాలను అందజేశారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలనే ప్రజల ఆకాంక్షను వినతిపత్రం ద్వారా వారికి తెలియచేయగా వారు అందుకు సానుకూలంగా స్పందించి ఈ అభ్యర్థనను మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో చర్చించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చినట్లు సిటిజన్ ఫోరం సభ్యులు తెలిపారు. ఫోరమ్ ప్రతినిధులు సయ్యద్ ఫరూక్, మల్లెపూడి రాజశేఖర్, సబ్బినేని శ్రీనివాస్, పీవీ కుమార్, గొల్లపూడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలోకి కైకలూరు..!

- కలపాలని నియోజకవర్గ ప్రజల డిమాండ్
- పలు సమస్యలకు ఇదే పరిష్కారమని భావన
- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలోనే తమను కొనసాగించాలన్న కైకలూరు నియోజకవర్గ ప్రజల సెంటిమెంట్‌ను నాటి వైసీపీ సర్కార్ పట్టించుకోలేదు. ఫలితంగా ఏలూరు జిల్లాలో కొనసాగుతోంది. తాజాగా కూటమి సర్కార్ జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఏర్పాటుచేసిన మంత్రుల కమిటీ అభిప్రాయ సేకరణ చేస్తున్న నేపథ్యంలో తమను కృష్ణాలో కలపాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కైకలూరును కృష్ణా జిల్లాలో కలపాలని మంత్రుల కమిటీకి లేఖ రాశారు. అలాగే జిల్లా అధికారులు తమ నివేదికలో సానుకూల వైఖరినే ప్రదర్శించినట్టు సమాచారం. మంత్రి వర్గ కమిటీ కూడా సానుకూలంగా స్పందిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గానికి వచ్చే పంట కాలువలన్నీ కృష్ణా నది నుండే అనుసంధానమై ఉంటాయి. కైకలూరు ఎగువన గుడివాడ, గుడ్లవల్లేరు ప్రాంతాల నుంచి కాలువలు నియోజకవర్గంలోకి వస్తాయి. నీటి సమస్య ఏర్పడితే ఇరు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే పరిష్కారమవుతుంది. అదే ఒకే జిల్లాలో ఉంటే ఇబ్బందులు ఉండవని ప్రజల అభిప్రాయం.

ముదినేపల్లి మండలం ఆది నుంచి గుడివాడకు దగ్గరగా ఉండడం పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా ఉంటయని ఆ ప్రాంత ప్రజలంతా కృష్ణా జిల్లాలోనే ఉంచాలనేది ప్రధాన డిమాండ్. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుపైనే స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.



శోభనాచలుడి గరుడోత్సవం

ఆగిరిపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం గరుడోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ భూనీలా సమేత లక్ష్మీ నరసింహస్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంత శేషబాబు స్వామికి తిరుకల్యాణం, గరుడోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మెట్ల కోనేరులో స్వామికి చక్ర స్నానం నిర్వహిస్తామని ఈవో సీహెచ్ సాయి తెలిపారు.

టెరిటోరియల్ డీఎఫ్‌వోగా సందీప్

ఏలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ఏలూరు డివిజనల్ టెరిటోరియల్ డీఎఫ్‌వోగా పాడేరు జిల్లా ఫారెస్టు అధికారి పోతంశెట్టి వెంకట సందీప్‌రెడ్డి నియమితులయ్యారు. కొద్దికాలంలో ఏలూరులో ఈ పోస్టు ఖాళీగా ఉండగా, విజయవాడ డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. తాజాగా ఆయనను ఇక్కడకు బదిలీపై నియమించారు.


అధ్వాన్నంగా తాడేపల్లిగూడెం-బాదంపూడి రోడ్డు

రూ.14.4 కోట్లతో గూడెం రోడ్లు

తాడేపల్లిగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం పట్టణానికి వచ్చే రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14.4 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్ల విషయమై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీలో గళమెత్తారు. నిధులు విడుదలపై ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పోలీస్ ఐలాండ్ నుంచి ప్రత్తిపాడు వై.జంక్షన్ వరకు రూ.7 కోట్లు విడుదల చేయడంతో పనులు ప్రారంభించారు. ఇటీవలే కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బాదంపూడి వరకు రూ.4.9 కోట్లతో రోడ్డు వేయడానికి నిధులు మంజూరుచేశారు. పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఇప్పుడు కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి దుర్గగుడి వరకు రోడ్డు వేయడానికి రూ.2.5 కోట్లు మంజూరు చేశారు. ఇవన్నీ పూర్తయితే తాడేపల్లిగూడెం పట్టణానికి రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయి.

ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయండి



ఏలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ నుంచి ఆమె భూసేకరణపై మంగళవారం సమీక్షించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, కాలనీల నిర్మాణం, జాతీయ రహదారులకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. కోర్టు కేసుల పురోగతిపై చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ అభిషేక్‌గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరావు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై సమీక్ష

జిల్లాలో 168 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు గాను 12 మాత్రమే గ్రౌండింగ్ కావడంపై కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె సమీక్షించారు. ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు వివిధ భూములను వేగంగా గుర్తించాలని కోరారు. వివిధ పరిశ్రమలకు సింగిల్ విండో పథకం కింద అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటి వరకు 435 అనుమతులివ్వగా, 39 అనుమతులను త్వరగా ఇవ్వాలన్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జీఎం పి సుబ్రహ్మమణ్యేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె బాబ్జీలు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్ మండలంలోని మూడు ఐఎంఎస్ఎల్ మద్యం షాపుల లైసెన్సుల మంజూరు కోసం ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గెజిట్‌లో సీరియల్ ప్రకారం 23, 24, 26 ఐఎంఎస్ఎల్ షాపులకు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల పేర్లను ఈ నెల 12న ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమీ కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు ఎక్సైజ్ శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు.

కొల్లేరు పరిరక్షణకు ప్రత్యేక అథారిటీ



- 26 మందితో రాజ్యాంగబద్ధ కమిటీ
- చైర్మన్‌గా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ
- సుప్రీంకోర్టులో వాదనల నేపథ్యంలో ప్రాధాన్యత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొల్లేరు సరస్సు పరిరక్షణ, పర్యవేక్షణ, సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 24మంది సభ్యులతో ప్రత్యేక అథారిటీని నియమించింది. సుప్రీంకోర్టులో 'కొల్లేరు అంశం'పై త్వరలో వాదనలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఇకపై కొల్లేరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా అథారిటీలోని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాల్సి వుంటుంది. కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ ప్రాంతం రామ్సార్ స్థలంగా గుర్తింపు పొందిన ఈ సరస్సును అభివృద్ధి చేసేందుకు చిత్తడి నేలల చట్టంలో చేర్చారు. 2.5 హెక్టార్లకంటే ఎక్కువ భూమి వెట్‌ల్యాండ్‌లో ఉంటే దానికి ప్రత్యేక అథారిటీని ఏర్పాటుచేయాలి. దీంతో కొల్లేరు సరస్సులో ప్లస్ కాంటూరు వరకు కొల్లేరు అభయారణ్యం, సరస్సు నిర్వహణ కు ప్రత్యేక అథారిటీని నియమించాలని నేషనల్ బోర్డు ఆఫ్ వైల్డ్ లైఫ్ (ఎన్‌బీఎల్) 2023 జూన్ 23న ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ రాజ్యాంగ బద్ధ అథారిటీకి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ చైర్మన్‌గాను, స్పెషల్ చీఫ్ సెక్రటరీ/ప్రిన్సిపల్ సెక్రటరీ ఈఎఫ్ఎస్‌టీ శాఖకు చెందిన ఒకరు వైస్ చైర్మన్‌గా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులను మంగళవారం జారీచేశారు.

మరో 24 మంది సభ్యులు వీరే

వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లాలోని అధికారులను సభ్యులుగా చేర్చారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫిషరీస్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు, హెడ్ ఆఫ్ ఫారెస్టు ఫోర్స్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్) (మెంబర్ కన్వీనర్), వ్యవసాయ శాఖ డైరెక్టర్, ఫిషరీస్ డైరెక్టర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్, టూరిజం శాఖ డైరెక్టర్, వైస్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఏపీఎస్ఏసీ), మెంబర్ సెక్రటరీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, చీఫ్ ఇంజనీర్ వాటర్ రిసోర్సెస్, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కలెక్టర్లు, మెంబర్ సెక్రటరీ, ఏపీ స్టేట్ బయోడైవర్శిటీ బోర్డు(గుంటూరు), బొంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ప్రతినిధి, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీ అండ్ ఫిషరీస్, ఏలూరు సర్ సీఆర్ఆర్ మహిళా కళాశాల, మెంబర్ కన్వీనర్ నామినేట్ చేసిన ఎన్జీవో, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(రాజమండ్రి సర్కిల్), డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్, ఏలూరు), సైంటిస్ట్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా డెహ్రాడూన్‌లు సభ్యులుగా ఉంటారు.

బోర్డు నుంచి అథారిటీ వరకు

- 1983లో ఏర్పాటు చేసిన కొల్లేరు డెవలప్‌మెంట్ అభివృద్ధి బోర్డు చైర్మన్‌గా టీడీపీకి చెందిన కమ్మిలి విఠల్ పనిచేశారు. అది కొంత కాలం పనిచేశాక ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది.
- 1999లో కొల్లేరులోని 77 వేల 138 ఎకరాల భూమిని అభయారణ్యం పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవో 120 జారీ
- 2002 చిత్తడి నేలల చట్టంలోకి చేరింది.
- 2006లో కొల్లేరు ఆపరేషన్ ద్వారా అక్రమ చెరువులను ధ్వంసం చేశారు.
- తాజాగా 24 మంది సభ్యులతో ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేశారు.

అథారిటీ ముఖ్య బాధ్యతలు

- కొల్లేరు సరస్సు పరిరక్షణ, అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పన.
- పర్యావరణ కాలుష్యం నియంత్రణ, నీటి నాణ్యత మెరుగుదలకు కృషి చేయడం.
- చేపల వైవిధ్యం రక్షణ, సుస్థిర మత్స్యాభివృద్ధికి పాటుపడడం.
- పర్యాటకాభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు సమగ్ర ఆదాయ అవకాశాలకు అన్వేషించడం.
- జీవ వైవిధ్యం సంరక్షణ, నీటి ప్రవాహ వ్యవస్థ పునరుద్ధరించడం.
- కొల్లేరుపై ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశం జరిపి పురోగతి సమీక్షించాలి.


టైలరింగ్ కోర్సు పూర్తి చేసిన మహిళల వ్యథ

శిక్షణ సరే.. కుట్టు మిషన్లు ఎక్కడ?

- ఉమ్మడి జిల్లాలో 3,500 మంది ఎదురుచూపులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

పట్టణ, గ్రామీణ మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన టైలరింగ్ కుట్టు శిక్షణలు ముగిశాయి. శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా అందిస్తామన్న టైలరింగ్ మిషన్లే ఊసే లేదు. రెండో విడతలో శిక్షణ పొందడానికి బ్యాచ్‌లకు రెడీ అవుతున్న తరుణంలో మిషన్ల జాడ లేకపోవడంతో బీసీ కార్పొరేషన్‌లో స్తబ్దత నెలకొంది. శాఖాపరంగా లబ్ధిదారులకు యూనిట్ల మంజూరు నిలిచింది. ఆదరణ-3 పథకం ఇంకా కొలిక్కి రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జిల్లావ్యాప్తంగా టైలరింగ్ శిక్షణ అవసరాలను గుర్తించి ఉమ్మడి జిల్లాలో ఈబీసీ కార్పొరేషన్ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళలు 18 నుంచి 50 ఏళ్లలోపు వారికి ఉచిత శిక్షణను ఈ ఏడాది జూన్‌లో ప్రారంభించారు. సెప్టెంబరు నాటికి 80 శాతం శిక్షణలు పూర్తయ్యాయి. గత నెలలో కొన్ని సెంటర్లలో శిక్షణలను పూర్తిచేశారు.

సర్టిఫికెట్లు జారీ.. మిషన్లు ఎప్పుడో..

శిక్షణకు మహిళల ఎంపిక పారదర్శకంగానే చేపట్టారు. మూడు నెలలు కాలంలో 75 శాతం అటెండెన్సీ ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తామని నిబంధన పెట్టారు. వీరికి ముఖ అధారిత హాజరును పరిగణనలోకి తీసుకున్నారు. మహిళలకు వెసులుబాటు ప్రకారం ఉదయం తొమ్మిది, మధ్యాహ్నం రెండు దాటాక శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 36 బ్యాచ్‌ల కింద 3,500 మందికి శిక్షణ పూర్తిచేస్తారు. వాస్తవంగా 65 సెంటర్ల ద్వారా ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం కాగా.. ఉన్నంతలో వేగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి శిక్షణకు ప్రభుత్వం నడుం బిగించింది. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలి. మరోవైపు ఉత్తమంగా ప్రతిభ చాటిన వారికి ఫ్యాషన్ డిజైన్ల కోర్సుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం యోచించింది. మిషన్లు పంపిణీ లేకపోవడంతో లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు.

● ఎందుకో ఈ జాప్యం?

ఒక్కొక్కరికి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు, ట్రైనీల పేరిట ఒక్కొక్కరికి రూ.21 వేలు గరిష్టంగా ఖర్చు పెట్టారు. మిషన్లు కొనుగోలుకు ఇంకా టెండర్లు పిలవలేదా ? లేదా రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణలు పూర్తికాలేదా? అంటే అధికారుల వద్ద సమాచారం లేకుండా ఉంది. కుట్టు శిక్షణలు నేర్చుకొని ఖాళీగా కూర్చోవాలా ? అంటూ మహిళలు నిట్టూర్చుతున్నారు. నేర్చుకున్నది మర్చిపోతామన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత సంప్రదించగా, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో మాకు తెలియదు. శిక్షణలు పూర్తిచేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మేము నడుచుకుంటామన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

జిల్లా లక్ష్యం 4.50 లక్షల మెట్రిక్ టన్నులు

- 234 రైతు సేవా కేంద్రాలు, 103 సహకార సంఘాల్లో ఏర్పాట్లు
- 85 లక్షల గోనె సంచులు రెడీ
- కోతలు ప్రారంభం కాగానే కొనుగోళ్లు ప్రారంభం


కుండపోత వర్షానికి దెందులూరు మండలం పోతునూరులో నేలనంటిన వరి పనలు

ఏలూరు సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు పూర్తయ్యాయి. వరి కోతలు మొదలు కాగానే వచ్చే వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఈ ఏడాది 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. 234 ఆర్ఎస్‌కేలు, అనుబంధంగా వున్న 103 సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. 108 రైస్ మిల్లులు, 234 రైతు సేవా కేంద్రాలలో 85 లక్షల గోనె సంచులను సిద్ధం చేశారు. ఈ మేరకు కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యాన్ని నిర్దేశించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేయనున్నారు. కొనుగోళ్లలో ఏ విధమైన సమస్యలు ఏర్పడినా టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ ఇతర శాఖలను సమన్వయ పరచుకుంటూ కొనుగోళ్లకు సిద్ధమైంది. ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ అందించారు. తేమ శాతం కొలిచే యంత్రాలను సిద్ధం చేశారు. 17 శాతంలోపు తేమ శాతం ఉండే ధాన్యానికి మద్దతు ధర అందుతుంది.

లక్ష్యానికి అనుగుణంగా కొనుగోళ్లు

ఈ ఏడాది ఖరీఫ్‌లో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కొనుగోళ్లకు సంబంధించి వ్యవసాయ శాఖ ఈ-కేవైసీ, ఈ-పంట నమోదు (మిగతా 8వ పేజీలో)


చిన వెంకన్న హుండీ ఆదాయం

రూ.4.22 కోట్లు

హుండీలో టాయ్ కరెన్సీ!

వివరాలు 7లో..

మద్ది క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


ముదినేపల్లి మండలం ఉప్పరగూడెం మలుపులో తిరగబడిన లారీ

డేంజర్ స్పాట్స్

జాతీయ, ప్రధాన రహదారులపై ప్రమాదకర మలుపులు

6

డేంజర్ ROAD

జాతీయ, ప్రధాన రహదారులపై ప్రమాదకర మలుపులు







జాతీయ రహదారి.. రాష్ట్రీయ రహదారి.. గ్రామీణ రహదారి మార్గం ఏదైనా ప్రమాదకర మలుపు ఉంటుంది. తరచు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. నివారణ చర్యలు మాత్రం శూన్యం. స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక, సూచికలు కానీ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాలను కలిపే జీలుగుమిల్లి - కొయ్యలగూడెం - జంగారెడ్డిగూడెం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు విస్తరించినా ప్రమాదకర మలుపులు, ఎగుడు దిగుడు మార్గంలో వేగంగా రాకపోకలు సాగించే భారీ వాహనాలతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. నరసాపురం - పెరవలి రహదారి ప్రమాదాలకు మారుపేరుగా మారింది. ప్రమాదకర మలుపులు స్వల్పమే అయినా వేగ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పడం లేదు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆకివీడు, కాళ్ల, ఉండి ప్రధాన రహదారులతో పాటు పెనుగొండ - సిద్ధాంతం రహదారిలో మలుపులు వాహనదారుల ఊపిరి తీసేస్తున్నాయి.

ఉండి.. ఆకివీడు.. కాళ్ల రహదారులు



ఉండి బస్టాండ్ నుంచి భీమవరం వెళ్లే మార్గంలో ప్రమాదకర మలుపు

ఉండి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉండిలో పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ప్రయాణికులు భయపడుతున్నారు. ఉండి బస్టాండ్ నుంచి భీమవరం రహదారిలో కర్రల అడితి వద్ద మలుపులో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉండి సెంటర్ నుంచి గణపవరం వైపు మలుపు పక్కనే పాముల పర్రు పంట కాలువ ఉంది. ప్రమాదం జరిగితే సరాసరి పంట కాలువలో పడతారు. ఉండి నుంచి పాములపర్రు వైపు తూము వద్ద మలుపులో సైతం తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆకివీడు: పట్టణ పరిధిలో మలుపులతో పాటు డివైడర్లు లేక పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. జానకమ్మ ఆసుపత్రి నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్ వరకూ రహదారి ఆక్రమణలకు గురికావడంతో ఎదురెదురు వాహనాలు తప్పుకోలేని పరిస్థితి. ఎస్ టర్నింగ్ (మలుపులు)లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన సెంటర్‌లో డివైడర్లు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి.

కాళ్ల: మండలంలో పలు గ్రామాల వద్ద రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా జక్కరం, పెద అమిరం, కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు గ్రామాల పరిధిలో రాష్ట్రీయ రహదారిపై ఉన్న మలుపులతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జక్కరం, సీసలి గ్రామాల వద్ద జరిగిన ప్రమాదాల్లో కొంత మంది వాహనచోదకులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. మలుపులు ఉన్నచోట ప్రమాద హెచ్చరికల బోర్డులు కూడా లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారినపడే అవకాశం ఉందని, అధికారులు స్పందించి మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కాళ్ల హైస్కూల్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపు

తాడేపల్లిగూడెం-భీమవరం రహదారి

పెంటపాడు: ప్రధాన రహదారులలో ప్రమాదకర మలుపులు ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. మండలంలోని ముదునూరు సమీపంలో తాడేపల్లిగూడెం - భీమవరం కేఎన్ రోడ్డులో ప్రమాదకర మలుపుల్లో నిత్యం ప్రమాదం జరుగుతూనే ఉంది. రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్స్, విద్యుత్ లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



తాడేపల్లిగూడెం - భీమవరం రహదారిలో ముదునూరు వద్ద మలుపు

జీలుగుమిల్లి - జంగారెడ్డిగూడెం రహదారి

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర రెండు రాష్ట్రాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి (516డి) అత్యంత ప్రమాదకరంగా మారింది. రహదారి వెంబడి పట్టణాలు, గ్రామాల ప్రధాన కూడళ్లలో మృత్యువు కబళిస్తోంది. తెలంగాణ నుంచి జీలుగుమిల్లి మీదుగా జంగారెడ్డిగూడెం వరకు కూడా మూడు, నాలుగు డెత్ స్పాట్‌లను పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో అనేక ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడగా పలువురు గాయపడ్డారు. జాతీయ రహదారిపై దేవరపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం నిత్యం వేలాది లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.

ముఖ్యంగా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి, వేగవరం, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జంగారెడ్డిగూడెం-బుట్టాయిగూడెం రహదారి, జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ పెట్రోల్ బంక్‌లతో పాటు డాబాలు, హోటల్స్, మద్యం దుకాణాలు ఉండడంతో జాతీయ రహదారి పక్కనే భారీ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలోకి రాకపోకలు సాగించే వాహనాలు ఈ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంది. రోడ్డు పక్కనే నిలిపిన భారీ వాహనాల కారణంగా కూడలి వద్ద వాహనాలు సరిగ్గా కనపడకపోవడం వలన ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రహదారి అభివృద్ధి చేసినా..!

జీలుగుమిల్లి: జాతీయ రహదారి విస్తరణ చేపట్టినా ప్రమాద సూచికలు లేకపోవడం, కొన్ని చోట్ల రహదారి ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనాల నియంత్రణ చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లు గుర్తించినా అక్కడ రోడ్డు పై రేడియం స్టిక్కర్లు కానీ, ప్రమాద సూచికలు కానీ లేవు. మరికొన్ని చోట్ల మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగతున్నాయి.

జీలుగుమిల్లి మండలంలో నెల రోజుల్లో సుమారు 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిపై 6 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అధికారుల దృష్టికి రానివి, ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి వెళ్లినవి ఎన్నో..!

కొయ్యలగూడెం.. నిత్యం ప్రమాదాలే!

కొయ్యలగూడెం: జంగారెడ్డిగూడెం-కొయ్యలగూడెం మధ్య జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 13 కిలోమీటర్ల రహదారిలో బయ్యన్నగూడెం పులివాగు వంతెన, కొయ్యలగూడెం టీసీ కాలనీ, నర్సన్నపాలెం వై.జంక్షన్ వద్ద తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఖమ్మం నుంచి విశాఖ వాహనాలు ఎక్కువగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. ట్రాఫిక్ ఎక్కువై తరచూ ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



జంగారెడ్డిగూడెం-బుట్టాయిగూడెం బైపాస్ రహదారిలో ప్రమాదకర జంక్షన్

అమ్మో.. జూబిలీ నగర్ మలుపు

లింగపాలెం: చింతలపూడి-లింగపాలెం రహదారిపై జూబిలీనగర్ వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. డివైడర్, స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఆటోలు, ద్విచక్ర వాహనదారులు అనేక మంది గాయపడ్డారు. ఈ నెల 3న ప్రైవేట్ ట్రావెల్ బస్ బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. యడవల్లి- యర్రంపల్లి మధ్య మలుపులో సూచిక బోర్డులు లేకపోవడంతో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి.

నరసాపురం-పెరవలి మార్గంలో భయం.. భయం..



216 జాతీయ రహదారిపై నరసాపురంలో రుస్తుంబాదా జంక్షన్

పెనుగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెనుగొండ-మార్టేరు రహదారిలో పలుచోట్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎస్‌వీకేపీ కళాశాల సెంటర్, బస్టాండ్ సెంటర్, సిద్ధాంతం మలుపు వద్ద ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. ఈ రహదారిపై గోతులతో వాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదు. పెనుగొండ - సిద్ధాంతం రహదారిలో నక్కల కాలువ సమీపం, వెంకట్రాయపురం - వడలి రహదారి, కొఠాలపర్రు - ఆచంట రహదారి, దేవ - ఆచంట రహదారిలో ఇరుకైన మలుపులు వల్ల హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

నెగ్గిపూడి లాకు వంతెన.. ప్రమాదం

పెనుమంట్ర: నరసాపురం-పెరవలి రహదారిలో నెగ్గిపూడి లాకు వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. వంతెన ఇరుకుకావడంతో పాటు వరి పరిశోధనా కేంద్రం నుంచి వచ్చే వాహనాలు సడన్‌గా మలుపు తిప్పడంతో ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతుంది. ఈ జంక్షన్ వద్దకు రాగానే అంతా భయపడుతారు. నెగ్గిపూడి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు యాక్టివాపై వెళుతుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పెనుగొండ పరీక్షలకు కళాశాలకు వెళుతూ ఎంబీఏ విద్యార్థి ప్రమాదంలో మృతి చెందింది. ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని యువకులు గాయపడుతున్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలెన్నో!

నరసాపురం రూరల్: నరసాపురం మీదుగా 216 జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిట్టవరం, రుస్తుంబాదా, చర్చి రహదారి వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల హెచ్చరిక లేకపోవడం, వాహనాలు వేగంగా వెళ్లడం ఒక కారణమైతే పట్టణం నుంచి జాతీయ రహదారి వైపు వచ్చే వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హైవేపై ఎక్కడబడితే భారీ వాహనాలు నిలిపివేయడంతో పలు వాహనాలు ఢీకొంటున్నాయి.



నరసాపురం-పెరవలి రహదారిలో పెనుగొండ వద్ద కిందికి మలుపు



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 14, 17 ఏళ్ల విభాగం సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు మంగళవారం జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 450మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాల, బాలికల విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఉండాలంటే చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఏలూరు జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అలివేలుమంగ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో సభ్యులు రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, శ్రీనివాస్, బాబూరావు, శ్రీలక్ష్మి, ప్రమీలారాణి, రాజీ, శ్యామల, ప్రేమ్‌కుమార్, యువరాజ్, పీడీలు పాల్గొన్నారు.



గర్భగుడి సమీపంలో పాదరక్షలు

క్షీరారామంలో అపచారం

స్వామివారి గర్భాలయం వద్ద పాదరక్షలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో గర్భగుడి సమీపంలో పాదరక్షలు కనిపించడం కలకలం రేపింది. కార్తీక మాసం సోమవారం రాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో గుర్తుతెలియని వ్యక్తి క్షీరా రామలింగేశ్వర స్వామివారి గర్భాలయం పక్కనే సుబ్రహ్మేశ్వరస్వామి గుడి డస్ట్ బిన్నుల వద్ద పాదరక్షలు ఉంచాడు. గమనించిన భక్తులు ఆశ్చర్యానికి గురై ఆలయ అధికారులకు తెలిపారు. దీనిపై హిందూ సంఘాలు, రామలింగేశ్వరస్వామి సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావును వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తి చెప్పులతో వచ్చి వెళ్లి ఉండవచ్చని, సీసీ కెమోరాల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



అఖండ జ్యోతికి ఆవు నెయ్యి సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

ఆచంటేశ్వరుడి సన్నిధిలో

అఖండ జ్యోతి

నేడు కార్తీక పౌర్ణమి వెలుగులు.. ఏర్పాట్లు పూర్తి

ఆచంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) వెలిగించనున్నారు. కార్తీక పౌర్ణమి రోజు ఆచంటేశ్వరాలయంలో అఖండ జ్యోతిని వెలిగించడం ఆనవాయితీ. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కృత్తిక నక్షత్ర హోమం, మండపారాధన, పూర్ణాహుతి మహానైవేద్యం, దూపసేవ అనంతరం కర్పూర జ్యోతిని వెలిగిస్తారు.

2 కేజీల దూదితో ఏక ఒత్తి

గడ్డి చుట్టిన దీప స్తంభంపై ఇత్తడి మండిగలో రెండు కేజీల దూదితో చేసిన ఏక ఒత్తి ఉంచుతారు. ఇత్తడి మండిగలో ఆవు నెయ్యి పోసి కర్పూరంతో జ్యోతిని వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు వెలిగించిన కర్పూర జ్యోతి మహా శివరాత్రి వరకు నిరంతరాయంగా వెలుగుతుంది. కార్తీక మాసం చివరి వరకు వేలాది సంఖ్యలో భక్తులు కర్పూర జ్యోతికి ఆవు నెయ్యి సమర్పించి మొక్కు చెల్లించుకుంటారు. ఎప్పటికప్పుడు ఆవు నెయ్యిని ఇత్తడి గుండిగలోకి తీసి ఉంచుతారు. నెయ్యి నిల్వలు పూర్తయ్యేవరకు జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. కార్తీక పౌర్ణమి ఒక్క రోజులోనే సుమారు 50 కేజీల పైగా ఆవు నెయ్యి భక్తులు సమర్పిస్తారు.

150 ఏళ్ల నాటి ఆనవాయితీ

రామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి నాడు గంధర్వ మహల్‌కు చెందిన గొడవర్తి కుటుంబీకులు కర్పూర జ్యోతిని వెలిగించడం ఆనవాయితీ. సుమారు 150 ఏళ్ల నుంచి గొడవర్తి కుటుంబీకులు జ్యోతిని వెలిగిస్తున్నారు. మహత్తర అఖండ జ్యోతి దేశంలో అరుణాచలం, కాశీ తర్వాత ఆచంట మాత్రమే పౌర్ణమి రోజున వెలిగిస్తారు.

25 వేల మంది భక్తుల రాక!

కర్పూర జ్యోతికి ఆవు నెయ్యి సమర్పించడానికి మొదటి రోజు 25 వేల మంది భక్తులు రావచ్చని ఆలయ అధికారుల అంచనా. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయం వద్ద ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు తగిన సౌకర్యాలతో పాటు రామగుండం వద్ద కూడా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు.

మద్ది క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

కార్తీక ఉత్సవాలు.. మంగళవారం ప్రత్యేక పూజలు



మద్ది ఆలయంలో ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మంగళవారం సందర్భంగా గుర్వాయిగూడెం మద్ది దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం మధ్యాహ్నం నుంచే సుదూర ప్రాంతాల భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తుల ఆలయ ప్రదక్షిణలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కుబడులు తీర్చుకుని స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులు (నాగవల్లీ దళములు)తో అష్టోత్తర పూజలు, అన్నప్రాసన, వాహనం పూజలను నిర్వహించారు. ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళ భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 12వేల మంది భక్తులు దేవస్థాన నిత్యన్నదాన సత్రంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మంగళవారం ఒక్క రోజే దేవస్థానంకు వివిధ సేవల రూపంలో రూ.6,01,570 ఆదాయంగా లభించినట్టు ఈవో చందన తెలిపారు.

ఆలయం వద్ద భారీ బందోబస్తు

గుర్వాయిగూడెం మద్ది అంజనేయ స్వామి వారిని కార్తీకమాసం రెండో మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని పోలీసులు భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ ఆధ్వర్యంలో లక్కవరం, జంగారెడ్డిగూడెం, తడికలపూడి పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు జబీర్, వరప్రసాద్, చిన్నారావు, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు, 34 మంది కానిస్టేబుల్స్, 10 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఇటీవల ఆలయాల వద్ద భక్తుల రద్దీ కారణంగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా మద్ది ఆలయం ద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు పటిష్టం చేసినట్టు సీఐ సుభాష్ తెలిపారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

ద్వారకాతిరుమల, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా సమకూరింది. 41 రోజుల కాలానికి హుండీ ఆదాయం మంగళవారం లెక్కించామని, నగదు రూ రూ.4.22 కోట్లు లభించినట్లు ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో అత్యంత భద్రతాఏర్పాట్ల నడుమ ఆదాయం లెక్కించారు. 4,22,31,799 రూపాయల నగదుతో పాటు 569 గ్రాముల బంగారం, 7.708 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (30), 1000 (20), 2000(3)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.



హుండీలో టాయ్ కరెన్సీ!

సాక్షాత్తూ వడ్డీ కాసుల వెంకన్నకు సైతం టాయ్ కరెన్సీ తాకిడి తప్పలేదు... హుండీలలో టాయ్ కరెన్సీ నోట్లు రావడం కలకలం రేపింది. స్వామివారి హుండీలో టాయ్ కరెన్సీ కనుగొన్న అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. మంగళవారం ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో రూ.500 కట్ట (100 నోట్లు)ఒకటి అనుమానంగా ఉండడంతో అధికారులు పరిశీలించి అవి టాయ్ కరెన్సీగా గుర్తించారు. ఈ నోట్లను హుండీలో ఎవరు వేశారనేది విచారణ జరపాల్సి ఉంది. హుండీల్లో ఇలా నకిలీ లేదా బొమ్మ కరెన్సీ వేయడం చట్టరీత్యా నేరం. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హుండీలో లభించిన ఇటువంటి కరెన్సీని దర్యాప్తు నిమిత్తం సాధారణంగా పోలీసులకు అప్పగిస్తారు.


పారిశ్రామికవేత్తలతో సమావేశమైన ఎంపీ మహేశ్

నార్వే వ్యాపారవేత్తలతో ఎంపీ మహేశ్ భేటీ

ఏలూరు టూటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నార్వే దేశానికి అధికారిక పర్యటన నిమిత్తం వెళ్లిన ఎంపీ మహేశ్‌కుమార్ అక్కడ వ్యాపారవేత్తలతో సమవేశమై పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. నార్వే రాజధాని ఓర్స్‌లోని సెంటర్‌ఫర్ రిసెర్చ్ ఆన్ జండర్ ఈక్వాలిటీ నిర్వహించిన లింగ సమానత్వం కార్యక్రమంలో భారత ఎంపీల బృందంతో పాటు పాల్గొన్నారు. అనంతరం నార్వే, ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలున్న పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఎంపీ మహేశ్ పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతూ 140 కోట్ల జనాభా ఉన్న భారత్ మార్కెట్‌పై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం నార్వే డైరెక్టర్ ఆఫ్ చిల్డ్రన్ యూత్ అండ్ ఫ్యామిలీ ఎఫైర్స్ నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. లింగ సమానత్వం కోసం నార్వే అనుసరించిన విధానాలు, సవాళ్లు, అమలు చేస్తున్న చట్టాలపై భారత ఎంపీల బృందానికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి

జీవన ప్రమాణాలపై చైతన్యం కల్పించాలి

పాత్రికేయులకు ఎమ్మెల్యే బడేటి చంటి సూచన

ఏలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పాత్రికేయలు తీసుకువెళ్లాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రెస్ బ్యూరో ఇన్ఫరేషన్(పీఐబీ)ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన వార్తాలాప్ వర్క్ షాప్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మీడియా సంస్థల మధ్య పీఐబీ నమ్మకమైన వారధిగా నిలుస్తుంని పీఐబీ విజయవాడ డైరెక్టర్ జి సురేష్‌కుమార్ అన్నారు. మీడియాలో ఆధునిక సమకాలీన మార్పులు, ఫేక్ న్యూస్‌కు సంబంధించిన పరిష్కార మార్గాలపై నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం ప్రొఫెసర్ అనిత అవగాహన కల్పించారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరరావు, పాల్గొన్న ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు

ఏలూరు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అవి నీతి రహితం, బాధ్యతగా విధులు నిర్వహించాలని డీఆర్వో వి.విశేశ్వరరావు సూచించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో అవినీతి నిరోధక శాఖ చట్టాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినా, ఆదాయానికి మించి ఆస్తులున్నా, ప్రభుత్వ ఆస్తులను దుర్వి నియోగం చేసినా శిక్షార్హమని, అవినీతి నిరోధకశాఖ చట్టాలననుసరించి శిక్షించడం జరుగుతుందన్నారు. అవినీతి నిరోధక శాఖ ఉమ్మడి జిల్లా డీఎస్పీ వి సుబ్బరాజు మాట్లాడుతూ సమాజంలో అవినీతి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు వారం రోజుల నుంచి అవగాహన వారోత్సవాలను నిర్వహించామన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ముఖ్యమైన సెంటర్లలో ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, అవినీతి నిరోధక శాఖ పోస్టర్లు ద్వారా ప్రచారం నిర్వహించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నెంబర్ లేదా 9440446157 లేదా 9440446158 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే, సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీ

ఏలూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత సైన్స్ డ్రామా కాంటెస్ట్ (ఎస్ఐఎస్‌డీసీ-2025) జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 5న జరుగుతాయని జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ది బెనిఫిట్ ఆఫ్ మ్యాన్‌కైండ్' ప్రధానాంశం, 'ఉమెన్ ఇన్ సైన్స్, స్మార్ట్ అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా ఎంపవరింగ్ లివ్స్, హైజీన్ ఫర్ ఆల్, గ్రీన్ టెక్నాలజీస్' ఉప అంశాలుగా పోటీలు ఉంటాయని వివరించారు. డ్రామా వ్యవధి 30 నిమిషాలకు మించ రాదని, స్క్రిప్ట్ ప్రాంతీయభాషలో ఉన్నప్పటికీ ఇంగ్లీషు అనువాదం తప్పనిసరి అన్నారు. జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు బుధవారం ఉదయం 10 గంటలకు ఏలూరు సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచినవారిని ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీకి పంపిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలో తొలి రెండుస్థానాల్లో నిలిచిన విజేతలను ఈ నెల 20, 21 తేదీల్లో బెంగళూరులో నిర్వహించే దక్షిణభారత స్థాయి పోటీకి పంపిస్తామని వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

లింగపాలెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారుతో పాటు ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని సీడీపీవో ఎం.లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందికి చైల్డ్‌రైట్స్ అడ్వోకసీ ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు ఆధ్వర్యంలో 'బాల్య వివాహాల నిరోధక చట్టం 2006' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ నజీముల్లాషా, సీడీపీవో ఎం.లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రామ లక్ష్మి, కుమారి, హెల్త్‌సూపర్‌వైజర్‌లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గన్ని

- త్వరలో సేల్స్ ఆఫీసర్ల నియామకం, త్రిసభ్య కమిటీలకు శిక్షణ
- డీసీసీబీ చైర్మన్ గన్ని

ఏలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూట మి ప్రభుత్వ సారథ్యంలో రానున్న కాలంలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీని ముం దంజలో నిలుపుతాం.. నెలరోజుల్లోనే యూపీఐ, క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ లావాదేవీలను బ్రాంచిల్లో ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తాం. దీనికి అందరూ కలిసికట్టుగా శ్రమించి పనిచేద్దామని డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపా రు. ఏలూరు నగర శివారులోని కల్యాణ మండ పంలో మంగళవారం డీసీసీబీ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్షన్నర కోట్ల టర్నోవర్‌తో స్వయం ప్రతిపత్తి సంస్థగా ఆప్కాబ్ పనిచేస్తోందని, ఈ నేపథ్యంలో నష్టాల బాటలో ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలను ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీలకు వారం రోజుల వ్యవధిలోనే నియోజకవర్గాల వారీగా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సేల్స్ ఆఫీసర్ల నియామకం చేపడతామన్నారు. వైసీపీ అనాలోచితంగా నిర్మించిన గోడౌన్లను అద్దెకిచ్చి సొసైటీలకు ఆర్థిక భారం తగ్గించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు గన్ని వివరించారు. డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ సొసైటీల్లోని గోడౌన్ల ద్వారా పలు చోట్ల డీసీఎం ఎస్, డీసీసీబీలు కలసి రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, దీనికి త్రిసభ్య కమిటీలు, ఉద్యోగులు సహకరించాలన్నారు. త్రిసభ్య కమిటీలు రానున్నకాలంలో మచ్చలేని పాలన అందించే దిశగా రికార్డులు నిర్వహణ, తనిఖీలు చేపట్టాలని సూచించారు. డీసీవో అరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో సేల్స్ ఆఫీస ర్లను, ఓఎస్డీ నియామకానికి చర్యలు చేపడతా మన్నారు. రికవరీలు సాధనపై దృష్టి పెడతామన్నారు.

సిబ్బందిని పెంచండి..

సొసైటీల్లో రికవరీల సాధనకు సిబ్బందిని పెంచాలని, డీసీసీబీకి ఓఎస్డీని నియమించాలని, రుణాల పరపతిని పెంచాలని, కౌలు రైతులకు సొసైటీల్లో రుణాలు ఇవ్వాలని, సేల్స్ ఆఫీసర్లను నియమించాలని త్రిసభ్య కమిటీల చైర్మన్లు కుటుంబశాస్త్రి, రాజు తదితరులు సభ దృష్టి తీసుకొచ్చారు. డీసీసీబీ సీఈవో పి. సింహాచలం, జిల్లా సహకార ఆడిట్ అధికారి కె. మురళీకృష్ణ, ఏలూరు డీఆర్ కె. సత్యవతి, జీఎం మాధవీ మూర్తి, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.


ప్రైవేటు స్లీపర్ కోచ్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్


జూబిలీనగర్‌లో ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదాలు నివారిస్తాం : రోషన్

చింతలపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులతో కలసి తగు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా రవాణాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లింగపాలెం మండలంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒకరు మృతి చెందడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో ప్రమాదాలు జరిగిన స్థలాల్లో డేంజర్ పాయింట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 17 నుంచి జిల్లాలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తారని, వాహనాల తనిఖీ ఉంటుందన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లకు బస్సు బయలుదేరే సమ యంలో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తారన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.కె. కరీం మాట్లాడు తూ లింగపాలెం సమీపంలో బస్సు బోల్తా ఘటనలో డ్రైవర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా తోలడం వల్లే ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామన్నారు. ఈ బస్సు అరుణాచల్ ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ అయ్యిం దని, దీనిని స్లీపర్ సీట్లుగా ఆధునీకరిం చారని, నిబంధనలకు విరుద్ధంగా ఎమర్జన్సీ డోరు వద్ద సీట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఏలూరు ఇన్‌చార్జి ఆర్టీవో శేఖర్, జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఆర్టీవో రంగనాయకులు, నూజివీడు ఏఎంఐ అన్నపూర్ణ పాల్గొన్నారు. సోమవారం రాత్రి బస్సు బోల్తాపడిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పరిశీలించారు. పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లో ప్రైవేటు ట్రావెల్స్ స్లీపర్ కోచ్ వాహనాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగినప్పుడు ఎమర్జెన్సీ గేటు ఏ విధంగా తెరుస్తారో పరిశీలించి డ్రైవర్‌కు సూచనలిచ్చారు.

లింగపాలెం: లింగపాలెం మండలం జూబిలీ నగర్ వద్ద ఘటనా స్థలాన్ని ఏలూరు రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శేఖర్, ఎంవీఐ కృష్ణవేణి, సీఐ క్రాంతికుమార్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళ వాహన డ్రైవర్‌లకు కనపడేలా రిఫ్లెక్టివ్ బోర్డులు ఏర్పాటు చెయ్యాలని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి డోలా

అవగాహనతోనే రోగం మాయం : మంత్రి డోలా

ఆగిరిపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నివారణే ఉత్తమ వైద్యం అనే భావనను నర్సులు రోగులకు అవగాహన కలిగిస్తే రోగం మాయమౌతుందని రాష్ట్ర సామాజిక, వృద్ధుల సంక్షేమ మరియు సచివాలయ శాఖల మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. తోటపల్లిలోని హీల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన సమగ్ర పాఠశాల ఆరోగ్య, వెల్‌నెస్ కార్యక్రమంపై డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులాలకు చెందిన 170 మంది నర్సులకు శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.


డీఈవోకు వినతి పత్రమిస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

విపత్తు సెలవుల భర్తీ వద్దు

ఏలూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి విద్యాశాఖ నిర్దేశించిన 225 పని దినాల సంఖ్య సరిపోతున్నందున విపత్తు (డిజాస్టర్) సెలవులను భర్తీ చేయనవసరం లేదని, ఆ మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)జిల్లా నాయకులు మంగళవారం డీఈవో వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. టీచర్లకు సంబంధించిన పలు సమస్యలపై డీఈవోతో చర్చించినట్టు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమైన నాటి నుంచి అక్టోబరు వరకు 95 పనిదినాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో 130 పనిదినాలున్న విషయాన్ని డీఈవోకు తెలియజేశామని, డిజాస్టర్ హాలిడేస్‌ను భర్తీచేయాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. అంధులు, దృష్టి లోపం, శారీరక వైకల్యం ఉన్న ఉపాధ్యాయులు వారానికోసారి స్కూలు ఆవరణలో ఇన్‌టైం, ఔట్ టైం రెండింటికీ ముఖ గుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్)ను ఇస్తే సరిపోతుందని, మిగిలిన రోజుల్లో వారు లీప్ యాప్‌లో హాజరు/గైర్హాజరు ఎంపికను మాత్రమే ఉపయోగించి హాజరును నమోదుచేయాలని వెసులుబాటు కల్పిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ ఇటీవల జారీచేసిన ఉత్తర్వులను జిల్లాలో అమలుచేయడానికి స్కూల్ హెచ్‌ఎంలకు సూచనలివ్వాలని డీఈవోను కోరామన్నారు. ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, రవికుమార్, ప్రకాశరావు, పవన్‌కుమార్, రామ్మోహన్, కాంతారావు, దాసు, రామారావు, ప్రవీణ్‌కుమార్, సురేష్‌కుమార్, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ఉన్నారు.

గొరగనమూడిలో నెట్ బాల్ పోటీలు

పాలకోడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ -17, అండర్ -14 బాలబాలికల స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలు మంగళవారం నిర్వహించినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పీఎన్ఎన్ మల్లేశ్వరరావు, డి. సునీత తెలిపారు. గొరగనమూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పోటీలను ప్రారంభించారు. అండర్ -17 నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు, అండర్-14 విభాగంలో ఎంపికైన వారు పశ్చిమ గోదావరి జిల్లా శృంగవృక్షంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటికీ అందని రేషన్.. సీఎస్‌డీటీకి డీలర్ల మొర

జంగారెడ్డిగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పేదలకు రేషన్ బియ్యం నేటికీ అందలేదు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి జంగారెడ్డిగూడెం మండలంతో పాటు పలు మండలాలకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారు. ఈ సరుకులను స్టేజ్-2 కాంట్రాక్టర్ ప్రతి నెలా 18 నుంచి నెలాకరు లోపు ఆయా మండలాల్లోని రేషన్‌షాపులకు తమ లారీల ద్వారా సరుకులు దిగుమతి చేస్తారు. అయితే నవంబరు నాలుగో తేదీ వచ్చినా పట్టణంలోని ఐదు షాపులకు, మండలంలోని రెండు షాపులకు బియ్యం, పంచదార అందచేయలేదు. ప్రతి నెలా పెద్ద లారీలు వెళ్లలేని రేషన్ దుకాణాలకు మినీ లారీ ద్వారా సరుకులు పంపిణీ చేసేవారు. కానీ కాంట్రాక్టరు మినీ లారీ ఏర్పాటు చేయకపోవడంతో పలు రేషన్ దుకాణాలకు సరుకులు అందలేదు. కేవలం రేషన్ షాపులపై ఆధారపడే అనేక మంది డీలర్లకు ఇప్పటికీ సరుకులు పంపకపోవడంతో వారంతా మంగళవారం స్థానిక సీఎస్‌డీటీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

ఐస్‌క్రీం ఫ్యాక్టరీపై మూడు కేసులు నమోదు

పెదపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, ఆహార తనిఖీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా పెదపాడు మండలం వట్లూరు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఐస్‌క్రీం తయారీ కేంద్రమైన మేసర్స్ సాయి త్రివేణి డెయిరీ ఫుడ్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గడువు తీరిన మూడు రకాల ఐస్‌క్రీమ్‌లను గుర్తించి, వాటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.ఆహార భద్రతా చట్టం ప్రకారం తయారీ కేంద్రంపై కేసు నమోదు చేశారు. అలాగే లైసెన్స్ లేకుండా ప్యాకింగ్ చేయడం, ఎటువంటి ధ్రువీకరణ లేని రెండు కాటాలను గుర్తించి తూనికలు, కొలతల చట్టం ప్రకారం మూడు కేసులు నమోదు చేశారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైరు చోరీ



ద్వారకాతిరుమల, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేం పాడులో ఓ రైతు పొలంలో మంగళవారం తెల్లవారు జామున కొం దరు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు ఆలపాటి మురళి, సమీప రైతులతో కలిసి సోమవారం రాత్రి 12 గంటల వరకూ పొలం లోనే ఉండి కోకో తోటలో పనులు పర్యవేక్షించారు. ఇంటికి వచ్చి మం గళవారం ఉదయం యథావిధిగా పొలంలోకి వెళ్లి చూసేసరికే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగిలిపోయి కన్పించింది. దీంతో ఆందోళన చెందిన రైతు పోలీసులను ఆశ్రయించాడు. ఇలా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్లను దోచుకెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు నష్టపోవడమే కాకుండా సకాలంలో పంటలకు నీరందడంలేదని ఆవేదన చెందుతున్నాడు. పోలీసులు ఇటువంటి చోరీలపై దృష్టి సారించాలని కోరారు.

ఆ యువతిపై లైంగిక దాడి జరగలేదు..

అసత్య ప్రచారాలు సరికాదన్న డీఎస్పీ శ్రావణ్ కుమార్


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అపస్మారక స్థితిలో ఉన్న యువతి ఆచూకీ లభ్యమైందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ చెప్పారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్ కుమార్, టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ మీడియాతో మాట్లాడి ఆ యువతి వివరాలు వెల్లడిచారు. అపస్మారక స్థితిలో ఉన్న యువతిని చూసిన వాళ్లు ఈ నెల 3వ తేదీ రాత్రి 112కు కాల్ చేశారు. టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ తన జీపులో తీసుకెళ్లి యువతిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో ఆచూకీ తెలియరాలేదన్నారు. మీడియాలో కొంత మంది ఆ యువతిపై లైంగిక దాడి జరిగిందని ప్రచారం చేశారన్నారు. ఇది వాస్తవం కాదన్నారు. నల్లజర్ల మండలం దూబర్లకు చెందిన ఆమెకు వివాహమైందని ఒక పాప కూడా ఉందన్నారు. భర్తతో మనస్పర్థలు రావడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటూ కూలి పనులకు వెళ్తోందన్నారు. ఆ యువతికి అనారోగ్యంతో బాధపడుతోందని, ఫిట్స్ కూడా వస్తుంటాయన్నారు. గొడవపడి అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లిపోతూ ఉంటుందని, అదే క్రమంలో ఈ నెల 3న దూబచర్ల నుంచి ఏలూరు పవర్ పేటకు వచ్చి అక్కడ కార్తికేయ వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసుకుని 12 పంపుల సెంటర్ ప్రాంతంలో తాగి తరువాత ఫిట్స్ వచ్చి పడిపోయిందన్నారు. కొంతమంది 112కు కాల్ చేయడంతో ఆసుపత్రిలో చేర్పించామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

ఏలూరు క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఏహూరు గ్రామ సమీపంలోని పై ఓవర్ బ్రిడ్జి కింద పట్టాలుదాటుతుండగా రైలు ఢీకొని ఒకరు(55) అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు సుమారు 5.4 అడుగుల ఎత్తు, నలుపు రంగు శరీరం, నీలం గడుల లుంగీ, తెల్ల చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎంఎస్ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో మంగళవారం సాయంత్రం వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ సెల్ నెంబర్ 99891 09912కు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

దెందులూరు: 16వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. దెందులూరు మండలం సత్యనారాయణపురం సమీపంలో 16వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని 50ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లరంగు గళ్లతో కూడిన ఎర్రని చొక్కా, నీలంరంగు నిక్కరు ధరించాడని, ఆచూకీ తెలిసినవారు దెందులూరు పోలీసులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడు..



ఏలూరు క్రైం: రైలు నుంచి జారి పడి ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బెంగ ళూరునకు చెందిన ఉమాశంకర్(72) బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు పుణ్యక్షేత్రాల సందర్శన ని మిత్తం యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళుతు న్నారు. మార్గ మధ్యలో ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి ఏలూరు సమీపంలోని వట్లూరు సబ్ స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో హెడ్‌కాని స్టేబుల్ పి.శ్రీనివాస్ తన సిబ్బందితో మంగళ వారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీ లించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమో దు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాక్టరు కింద పడి యువకుడు..



జీలుగుమిల్లి: ట్రాక్టరు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన చిర్రివారిగూడెం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన పొట్టా అఖిల్(18) జీలుగుమిల్లి నుంచి చిర్రివారిగూడెం వైపు వెళ్తుం డగా ఎదురుగా వచ్చిన మరో ట్రాక్టరును తప్పిం చాడు. ఈక్రమంలో ప్రమాద వశాత్తు ట్రాక్టరు అదుపు తప్పింది. దీంతో ట్రాక్టరుపై ఉన్న అఖిల్ అదే ట్రాక్టరు టైర్ కింద పడ్డాడు. తలపై ట్రాక్టరు టైర్ ఎక్కటంతో తీవ్ర రక్తస్రావమయ్యి అక్కడి కక్కడే రోడ్డుమీద మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ పరిశీలించారు. అమ్మమ్మ ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టరు డ్రైవర్



బుట్టాయగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరుతో వ్యవసాయ భూమిని దున్నుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ అనం దుర్గారావు(60) మరణించిన సంఘటన మంగళ వారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జరిగింది. జంగారెడ్డిగూడెం మండలం తిరుమ లాపురానికి చెందిన దుర్గారావు కొమ్ము గూడేనికి చెందిన నిమ్మగడ్డ సత్యనారాయణ మూర్తి పోలం దున్నుతుండగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలాయి. షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ తీగలను సరి చేయాలని గతంలో రైతు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్టు రైతు తెలియజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన!

పాలకొల్లు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 9వ తరగతి విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని దొడ్డిపట్ల రోడ్డులోని ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అడవిపాలెం వద్ద నివాసం ఉంటున్నాడు. తన నివాసంలో ట్యూషన్లు కూడా చెబుతున్నాడు. అదే స్కూల్లో 9వ తరగతి చదివే విద్యార్థిని కూడా ట్యూషన్‌కు వెళ్తోంది. రెండ్రోజుల క్రితం విద్యార్థిని ట్యూషన్‌కు వెళ్లకపోవడంతో మరో విద్యార్థినితో కబురు పంపి పిలిపించాడు. ట్యూషన్‌కు వచ్చిన విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కేకలు వేసింది. సదరు ఇంటి యజమాని విషయం తెలుసుకుని ప్రైవేటు ఉపాధ్యాయుడిని మందలించి, ఇంటిని ఖాళీ చేయాలని చెప్పినట్టు సమాచారం. ఈ ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందనే భయంతో స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసి, ఉపాధ్యాయుడిని తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సదరు ఉపాధ్యాయుడు టెన్త్ పాఠాలు చెబుతాడని, ఇప్పటికిప్పుడు తొలగిస్తే మరొకరిని నియమించు కోవడం కష్టమవుతుందని తొలగించడం సాధ్యం కాదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని, అయితే ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని బంధువులు కోరుతున్నారు.

హైవేపై మొక్కజొన్న పిండి.. కారును ఢీకొట్టిన లారీ


మొక్కజొన్న పిండిని తొలగిస్తున్న సిబ్బంది

పెదపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపర్రు సమీపంలో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై వెళుతున్న లారీ నుంచి మొక్కజొన్న పిండి అనుకోకుండా జారి చెల్లాచెదురుగా పడింది. అదే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు మొక్క జొన్న పిండి కారణంగా జరిపడ్డారు. మోటార్ సైకిలిస్ట్ జాతీయ రహదారి మధ్యలో జారిపడటంతో వెనుక వస్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో ఆ వెనుక వస్తున్న లారీ కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లేపల్లి ఉదయ రజని(కృష్ణలంక విజయవాడ) షేక్ షాతిమా (విజయవాడ)లకు గాయాలు కాగా వీరిని తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. మోటార్ సైకిలిస్ట్‌కు స్వల్పగాయాలైనట్లుగా సమాచారం.


ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్.ఐ

చీరవల్లి పేరంటాలమ్మ గుడిలో చోరీ

కుక్కునూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీరవల్లి గ్రామ శివారులో ఉన్న పేరంటాలమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఇనుప రాడ్డుతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న డబ్బును దొంగిలించినట్లు తాండ్ర సురేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్.ఐ. రాజారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రామసింగవరంలో ఓ పేకాట స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేశారు. మఫ్టీలో వెళ్లిన పోలీసులను గుర్తించని ఏడుగురు జూదరులు పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.20,200 నగదు, 19 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ సుధీర్ కోరారు.

అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు ప్రసిద్ధి చెందిన అభయాంజేయ స్వామి ఆలయం వద్ద దాత మునునూరి ప్రసాద్, నాగస్వరూపరాణి దంపతుల ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 350 మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు.

సమాజాభివృద్ధికి సైన్స్ దోహదం : ఎంఈవో నరేంద్రరాయ్

బుట్టాయగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సైన్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈవో-2 సిహెచ్ నరేంద్రరాయ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు.చోడెం ఊహ, చవలం విజయశ్రీ, పోశం అను, వెట్టి మంగరాజు, కొవ్వాసు మోహన్, పట్ల నాగబాబు బహుమతులు గెలుపొందగా ప్రశంసా పత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. వీరంతా ఏలూరులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.



ఎస్పీ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతున్న పోలీసులు

వృద్ధాశ్రమంలో ఎస్పీ కిశోర్ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ పుట్టిన రోజును మంగళవారం వృద్ధుల మధ్య జరుపుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏఎస్పీ సూర్యచంద్రరావు పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు పత్తేబాదలో ఉన్న నిశ్చింత వృద్ధుల ఆశ్రమానికి వెళ్ళి అక్కడ కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. వంటకాలను ఆయన స్వయంగా వారికి వడ్డించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

టి.నర్సాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి చెకుముకి టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని జనవిజ్ఞాన వేదిక ఏలూరు జిల్లా ప్రచార కార్యదర్శి పురం శ్రీనివాస తెలిపారు. టి.నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు కే.శశిఅభినవ్, తారక రిషీత్, ధర్మఫణితేజ ప్రథమ స్థానం సాధించగా, టి.నర్సాపురంలోని శ్రీసాయి సూర్య హైస్కూల్ విద్యార్థులు దివ్యశ్రీ, తులసీ ప్రియ, జీ.షర్మిలదేవి ద్వితీయ స్థానంలో నిలిచారని ఆయన తెలిపారు. ఈ నెల 23న ఏలూరులో నిర్వహించే జిల్లా స్థాయిలో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఎ.వి.నారాయణరావు, ఎస్.చైతన్య కుమార్, పవన్ కుమార్, బీ.రామస్వామి, వాసు, దీపా ఈశ్వరిదేవి, మహేశ్ పాల్గొన్నారు.

చెకుముకి విజేతలు వీరే..

నిడమర్రు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెకుముకి పోటీలు విద్యార్థుల ప్రతిభా పాటవాలు వెలికితీయడానికి చక్కని వేదికగా నిలుస్తాయని నిడమర్రు మండల విద్యాశాఖాధికారి వై.శేషగిరిరావు అన్నారు. మంగళవారం నిడమర్రు మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పెదనింద్రకొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు మద్ద డేవిడ్ లివింగ్‌స్టన్, మద్దిపట్ల పవన్ కుమార్, బలే అభిరామ్‌లు గెలుపొందారు. చిననింద్రకొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానాన్ని బావాయిపాలెం, అడవికొలను విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు మండల విద్యాశాఖాధికారి అనూరాధ బహుమతులు అందజేశారు.

వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన

ఏలూరు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.కె.హబీబ్ బాష ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నిర్దేశించిన మిల్లులకు తరలించాలని, గన్నీ బ్యాగులు సరిపడా అందుబాటులో ఉంచాలని, తేమ నిర్ధారణ, రైసు మిల్లులకు అందుబాటులో ఉంచాలన్నారు. తేమ నిర్ధారణ, రైసు మిల్లులకు ధాన్యం రవాణా, ఆన్‌లైన్ నమోదు తదితరాలపై సూచనలిచ్చారు. ఏడీఏ అనిల్‌కుమారి, ఎంఏవో జీవన సంధ్య పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సు

పెదపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం, పనిచేసే ప్రదేశాల్లో భద్రత, న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచితన్యాయ సేవలపైన అవగాహన కల్పించామన్నారు. న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ ద్వారా సంప్రదించాలన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోపాల్‌కృష్ణ, ప్యానల్ లాయర్ కృష్ణారావు పాల్గొన్నారు.

వృత్తి విద్యా విధానం గురించి తెలుసుకోవాలి



పెదవేగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు వృత్తి విద్యా విధానంపై అవగాహన కల్పించుకోవాలని విజయరాయి జడ్పీ ఉన్నత పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయుడు బి.శ్రీను అన్నారు. పెదవేగి మండలం విజయరాయి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా ఏలూరులోని ఎంఎస్ జాస్పర్ ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. అక్కడ యంత్రాల పని తీరు, పనిచేసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. శ్రీను మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్స్‌లు నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ పర్యటనలో హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.ఎస్.హెచ్.శివ ప్రసాద్, 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు గోడు

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గం ఏ జిల్లాలో కలుస్తుందనే దానిపై ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అతిపెద్ద డివిజన్ : నూజివీడు డివిజన్‌ను ఏలూరు జిల్లా పరిధిలోకి తీసుకోవడంతో డివిజన్‌లోని 14 మండలాల్లో 10 కృష్ణా, ఎన్.టి.ఆర్ జిల్లాల్లో విలీనమయ్యాయి. తిరువూరు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కాగా నూజివీడు కేంద్రంగా కేవలం నాలుగు మండలాలు మాత్రమే మిగలడంతో ఇక్కడ వున్న ప్రధాన శాఖల కార్యాలయాలు ఏలూరు జిల్లా కేంద్రానికి తరలిపోయాయి. చివరికి నూజివీడు డీఎస్పీ కార్యాలయం తరలిపోయే పరిస్థితిని నాటి డీఎస్పీ అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుకు వివరించగా ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏలూరు డివిజన్ పరిధిలోని పెదవేగి, పెదపాడు పోలీస్ స్టేషన్‌లను నూజివీడు డీఎస్పీ కార్యాలయ పరిధిలోకి తీసుకొచ్చారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చింతలపూడి, లింగపాలెం మండలాలను తీసుకొచ్చారు. నూజివీడు డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రానికి తరలిపోయాయి.

మూడు డివిజన్‌లుగా మారుస్తున్నారా?

ప్రస్తుత జిల్లాల పునర్‌వ్యవస్థీకరణలో ఇప్పటికే ఎన్.టి.ఆర్ జిల్లాలో ఉన్న తిరువూరు డివిజన్‌తోపాటు తాజాగా గన్నవరం డివిజన్‌గా మార్చి ఈ 14 మండలాలను మూడు డివిజన్‌లుగా ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నట్టు సమాచారం. ఏది ఏమైనా నూజివీడు డివిజన్‌ను గత ప్రభుత్వం అశాస్త్రీయంగా విభజించగా దాన్ని సరిచేసి నూజివీడు డివిజన్‌కు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలను వేగవంతం చేసింది. దాదాపు ఈ ప్రక్రియలు పూర్తయ్యాయి. గత ఇబ్బందులు పునరావృతం కాకుండా ఈసారి కొనుగోళ్లను సమర్థవంతంగా చేయాలని నిర్ణయించారు.

ధాన్యం కొనుగోళ్లపై జేసీ సమీక్ష : ధాన్యం కొనుగోలుపై జేసీ ఎంజె అభిషేక్‌గౌడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో వారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 108 రైస్ మిల్లుల్లోని 85 లక్షల గోనె సంచుల్లో 60 లక్షల సంచులు బాగున్నాయని, మిగతా 25 లక్షల సంచులు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుని చిన్నచిన్న చిరుగులు ఉంటే కుట్టి సిద్ధం చేయాలన్నారు. రైతులకు మాత్రం నాణ్యమైన గోనె సంచులు మాత్రమే ఇవ్వాలన్నారు. బ్యాంకు గ్యారెంటీలు, సిద్ధం చేసుకోవాలని రైస్‌మిల్లర్లకు చెప్పామన్నారు. హమాలీలు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వెను వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ధాన్యం రవాణాలో లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్లు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని జేసీ పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళ ప్రారంభం అవుతాయిని ఆయన పేర్కొన్నారు.

మరింత చేరువగా రూఫ్ టాప్



రూఫ్ టాప్ సోలార్ వేయించిన మహిళ

ఏలూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నిబంధనలు సడలిస్తున్నాయి. తాజాగా డిస్కమ్ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందేలా అవకాశం కల్పించారు. దీని ద్వారా వీలైనంత ఎక్కువ మందికి పథకం అందించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. పథకం ప్రారంభంలో ఏడాదికి

పీఎం సూర్యఘర్‌లో నిబంధనల సడలింపు
సద్వినియోగించుకోవాలంటున్న అధికారులు

రూ.15 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి మాత్రమే రాయితీ లభిస్తుందని ప్రకటించారు. ఆతరువాత ఈ పరిమితి ఎత్తేశారు. సొంతిల్లు ఉన్నవారు ఇంటిపైకప్పుపై దీనిని ఏర్పాటు చేసుకోవచ్చు. దీని వల్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎంత ప్రయోజనమంటే..?

ఒక్కో వినియోగదారుడు మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునే వీలుంది. ఒక కిలోవాట్ ద్వారా రోజుకు నాలుగు యూనిట్లు చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనికయ్యే ఖర్చు రూ.80 వేలు, అందులో ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలోవాట్లకు నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. రూ.60 వేలు రాయితీ వస్తుంది. మూడు కిలోవాట్లు పెట్టుకుంటే రూ.78 వేలు రాయితీ లభిస్తుంది. నెలకు 360 యూనిట్లు సోలార్ విద్యుత్ వస్తుంది. సగటు వినియోగదారులకు ఈ పథకం సరిపోతుంది. ఇందుకయ్యే మొత్తంగా రుణంగా ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి. కేవలం రూ.వెయ్యి డౌన్ పేమెంట్ మూడు కిలోవాట్ల పథకం పెట్టుకోవచ్చు. నెలనెలా కట్టే విద్యుత్ బిల్లును ఐదేళ్ల ఈఎంఐల కింద బ్యాంకుకు చెల్లిస్తే కడితే మిగిలిన 20 ఏళ్ల విద్యుత్ ఉచితమే అని అధికారులు చెబుతున్నారు.

విస్తృత ప్రచారం చేస్తున్నాం..



రూరల్ మండలం పరిధిలో ఐదు వేల మందికి పీఎం సూర్యఘర్ పథకం అందించాలని లక్ష్యంగా నిర్దేశించింది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం 1500 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 450 మందికి ఏర్పాటు చేశాం. మరో 450 గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. వీటి సంఖ్య పెంచడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

బి.నర్సయ్య, ఏఈ, రూరల్ మండలం

జిల్లాలో ఘనంగా ఐక్యత ర్యాలీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో యూనిటీ మార్చ్ పేరిట కార్యక్రమాలు నిర్వహించన్నుట్టు ఏలూరు జిల్లా యువ, మేరా భారత్ అధికారి సుంకర రాము వివరించారు. మంగళవారం లక్ష్మీవారపు పేటలోని మేరా భారత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలో కేంద్ర ప్రభుత్వ యువజన క్రీడా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐక్యత యాత్ర పేరిట యూనిటీ మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగానే ఐక్యత ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనిటీ యాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. సీఈవో మాట్లాడుతూ భారత్‌లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిద్యాలను ప్రతిబింబించేలా పట్టణాలు, గ్రామాల్లో ఈ పాదయాత్రలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యోగా, ఆరోగ్య శిబిరాలు, అవగామన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచార యాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. నాగ సురేష్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న చింతమనేని

గాలాయగూడెం సచివాలయం పరిశీలన

దెందులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):సరైన నాణ్యత లేకుండా తూతూ మంత్రంగా వైసీపీ నాయకులు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించి బిల్లులు తీసుకున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గాలాయగూడెం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం నిర్మించి రెండేళ్ల కుడా పూర్తికాకుండానే ఫ్లోరింగ్ కుంగిపోవడంపై చింతమనేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో నిర్మించిన ఈ భవనం అనతికాలంలోనే అధ్వాన స్థితికి చేరుకోవడంపై విచారణ చేసి తనకు నివేదిక ఇవ్వాలని దెందులూరు ఇన్‌చార్జి ఎంపీడీవో భీమరాజు, అధికారులను చింతమనేని ఆదేశించారు. గ్రామాల్లో చెత్త ఎక్కడా కనిపించకుండా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని చింతమనేని ప్రభాకర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చింతమనేని సోదరుడు విష్ణు, మాగంటి గిరిబాబు, పలువురు నాయకులు ఉన్నారు.



అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా అన్నప్రసాద వితరణ

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మంగళవారం నేపథ్యంలో స్థానిక కోటదిబ్బ వద్ద ఉన్న శ్రీగణపతి త్రిదేవిపీఠం ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. భక్తులు సామూహికంగా హనుమాన్‌చాలీసా పారాయణ పఠించారు. ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేయగా రేషన్ డీలర్ల సంఘ నాయకులు రాజులపాటి గంగాధరరావు, పసుపులేటి శివ, చిందా కృష్ణంరాజు, బత్తిన సత్య నారాయణ, ఆదిబాబు బృందం సేవలందించారు.

నేడు కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో ఉన్న శివాలయాల వద్ద బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వేదిక, పారాయణలు నిర్వహించేందుకు స్థలాలను ఏర్పాటు చేశారు.కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించేందుకు, ఒత్తులు వెలిగించుకునేందుకు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. నగరంలో అన్ని ఆలయాల వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు చేసుకునేందుకు, నోములు నోచుకునేందుకు అన్ని ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు పూర్తి చేశారు.

జాతరైనా పూజలు చేసుకోవచ్చు..

ఏలూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో జాతర జరుగుతున్నప్పటికీ కార్తీకమాసం పూజలు చేసుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, జాతర చేసుకుంటే పూజలు చేయకూడదని ఏ శాస్త్రాలు, వేదాల్లోనూ లేదని రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

దెందులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి లక్ష్యాలకు అనుగుణంగా బీజేపీ బలోపేతానికి అంతా కలిసి పనిచేయాలని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కన్వీనర్, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. మంగళవారం దెందులూరులోని వీరమాచినేని కల్యాణ మండపంలో పార్టీ మండలాధ్యక్షురాలు చీకటి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఉండవల్లి వెంకట్రావు, కీర్తి రాంప్రసాద్, వీర్రాజు, వెంకన్న బాబు, ఏసోబు, సోమబ్రహ్మం, శేఖర్, సురేష్, నళిణి, చీకటి ప్రభు చౌదరి పాల్గొన్నారు.

ముగిసిన రాజకీయ శిక్షణ తరగతులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని ఒక ప్రైవేటు కల్యాణ మండపం వద్ద ఈ నెల 1వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు మంగళవారం ముగియడంతో భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్మికులు ఎర్రని వస్త్రాలు, జెండాలు ధరించి నినాదాలతో పట్టణంలో భారీ ప్రదర్శన జరిపారు. మునిసిపల్ కార్యాలయం నుంచి వంతెన, మెయిన్‌బజారు, బిర్లాభవన్ సెంటర్, కన్నయ్య పార్కు మీదుగా మర్చంట్ చాంబర్స్ కల్యాణ మండపానికి చేరుకుంది. అక్కడ ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్లకు పాలకులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సభలో ఇఫ్టూ నాయకులు బి.సోమయ్య, టి.సుధాకర్, రెడ్డి అప్పలనాయుడు, కె.పోలారి, యర్రా శ్రీనివాసరావు, యు.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ, మోహన్, పద్మ, కె.వి.రమణ పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కీటకజనిత(వెక్టార్ బోర్న్ డిసీజెస్) వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపుపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో పవర్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ దోమలు పెరిగే నీటి ఆవాసాలను తొలగిస్తే లార్వా దశలోనే కీటకజనిత వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి లార్వాను గుర్తించి నాశనం చేయాలని సూచించారు. మురుగు కాల్వల్లో చెత్తవేయకుండా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమ్, ఝాన్సీ శ్రీనివాసరావు, మణికుమార్ పాల్గొన్నారు.

చేబ్రోలులో ఉచిత వైద్య శిబిరం

నిడమర్రు నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎక్కువ బరువులు మోయడం వల్ల వెన్నుముక సమస్యలు ఉత్పన్నమవుతాయని రాజమండ్రి వేద హాస్పటల్ వెన్నుముఖ వైద్య నిపుణులు పి.తేజో ఫణీంద్ర అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండం చేబ్రోలులో పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రందే లక్ష్మీ సునీత ప్రారంభించగా ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జడ్జి బొమ్మిడి అప్పారావులు పాల్గొని సూచనలిచ్చారు.

పారిశుధ్య నిర్వహణపైనే ఆరోగ్యం

పెదవేగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపైనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉందని డీఎల్‌డీవో ఏబీపీవీ.లక్ష్మి అన్నారు. పెదవేగి మండలం నడిపల్లి, విజయరాయి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను మంగళవారం ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, సున్నం వంటివి చల్లుతూ ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు ముమ్మరంగా పడుతున్న నేపథ్యంలో తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కొయ్యలగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదవేగిలో బుధవారం జరిగే జిల్లా స్థాయి పోటీలకు మండలంలోని మేధా స్కూల్‌కు చెందిన ఏ.సోమశేఖర్, బీ.ధరణి, ఎస్.శ్రీవల్లి, ఎంపికైనట్లు కరస్పాండెంట్ నల్లూరి మధు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ ధనరాజు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరగాలి

చింతలపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యశోభ అన్నారు. మంగళవారం యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆశా డే సందర్భంగా ఏఎన్ఎంలకు, ఆశాలకు, సిబ్బందికి ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు వేయించడం, దానివలన ఉపయోగాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పీహెచ్‌సీల్లోనే డెలివరీలు చేయించేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా డీపీహెచ్ఎన్ డాక్టర్ నరేశ్, డాక్టర్ గీత, ఎంపీహెచ్ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై పీసా కమిటీ సమావేశం

కుక్కునూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు పంచాయతీలోని నల్లకుంట, లంకాలపల్లి, వంజ్యంవారిగుంపు, కొర్లకుంట, ఇసుకపాడు, కిష్టారం గిరిజనులు పీసా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశమయ్యారు. ముంపులో లేని గిరిజన భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌ను ఓపెన్ చేయాలని తద్వారా వారసత్వ భూమిని వారసులకు చెందేలా పట్టాలివ్వాలని కోరారు. గిరిజనులకు పట్టాదారు పాస్‌బుక్‌లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ఏడు గిరిజన గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పీసా కమిటీ సభ్యులు ఊకే భద్రయ్య, మడకం వెంకటేశ్వర్లు, మడకం నాగేశ్వరరావు, మడకం వీరయ్య, గజ్జి రాజులు, శీలం లక్ష్మయ్య పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే చంటి అన్నారు. మినీ బైపాస్ రోడ్డులో గుడారాలు వేసుకుని బొమ్మలు తయారు చేసుకుంటూ జీవిస్తున్న పేదలు తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయి తినడానికి తిండిలేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఎమ్మెల్యే చంటి వారిని సందర్శించి నిత్యావసరాలు, రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తహసీల్దార్ గాయిత్రీ, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థ సారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ ప్రశంసనీయం



ఏలూరు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ శాంతి భద్రతల పరిరక్షణలో తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని ఏలూరు మాజీ ఎమ్మెల్యే, అంబికా గ్రూపు సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ కొనియాడారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ ఇటీవల సైబర్ క్రైమ్ నిరోధించడంలోను, ముద్దాయిలను గుర్తించడంలో ఎస్పీ పేరు దేశ వ్యాప్తంగా మార్మోగుతోందన్నారు. చక్కటి వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్న ఎస్పీ ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

189 మందికి నేత్ర పరీక్షలు

దెందులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు రవి కిరణ్ కంటి ఆసుపత్రి ప్రధాన వైద్య నిపుణురాలు డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం దోసపాడు పాత సీఎస్ఐ చర్చి ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వ హించారు. 189 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 32 మందికి కళ్ల అద్దాలు అందించారు. చట్టుమాల ప్రేమ్ కుమార్, వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొన్నారు.



ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన చోటే వేసిన చెత్త

హెచ్చరిక బోర్డులు ఉన్న చోటే చెత్త దర్శనం

పెదపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):చెత్త ఉన్న చోట అధికారులు ఫ్లెక్సీలు పెడతారో.. లేక ఫ్లెక్సీలు ఉన్నచోట స్థానికులు చెత్త వేస్తారో తెలీయదు కానీ మండలంలోని అనేక గ్రామాల శివారుల్లో చెత్త వేయరాదంటూ ఫ్లెక్సీలు పెట్టిన చోటే చెత్త దర్శనమిస్తోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టి కోసం షెడ్లు నిర్మించారు. అనేక చోట్ల ఆ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉంటే రాత్రిళ్ల మందుబాబులు మద్యం తాగేందుకు ఉపయోగపడుతున్నాయి.పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో సేకరించిన చెత్తను తీసుకెళ్లి ఆ డంపింగ్ యార్డుల పక్కనే వేస్తున్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి సంపద సృష్టి చేయడం లేదు. హెచ్చరిక బోర్డులు పెట్టి ప్రయోజనం ఏమిటంటూ విమర్శలు వస్తున్నాయి. చెత్త సేకరణను అధికారులు చిత్తశుద్ధితో చూపించాలని కోరుతున్నారు.



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

దెందులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అండర్-14విభాగంలో పేదవేగిలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఇద్దరు దెందులూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్లెస్ విద్యార్థులు కాళిదాసు వెంకట కార్తీక్, రేమల్లి యశ్వంత్‌లు పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్, పీడీ తూంపాటి బాబూరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు, హెచ్ఎంలు అభినందించారు.

మెటర్నిటీ లీవుల జీవో కోసం వినతి

ఏలూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులను వినియోగించుకునే వెసులుబాటు రిటైర్మెంట్ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత జీవో విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్టు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.మురళి, ఎం.రాంబాబు తెలిపారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం కళ్ళచెరువులో టీడీపీ కార్యాలయాలన్ని, సీసీ రోడ్లను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. మరికొన్ని రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఉపాధి పథకం ద్వారా గ్రాంట్‌లో గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిపారు. టీడీపీ నాయకులు కంఠమనేని అంజిమూర్తి, బేతిన వెంకట్రావు, ఘంటా సుదీర్ బాబులతో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి లక్ష బిల్వార్చన

జీలుగుమిల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. మండల దీక్ష చేపట్టిన హనుమాన్, అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన చేశారు. అర్చకులు చిరంజీవి శర్మ, రవిశర్మ సహస్ర నామార్చనలు చేశారు. ఏఈవో పసుపులేటి బాలాజీ, ఆలయ కమిటీ కోలా ధర్మరాజు, కొప్పుల అన్నవరం, గంధం వెంకటేశ్వరరావు అన్నసమారాధనలు చేశారు.

వైసీపీ ఆరోపణలు అర్థరహితం

టి.నర్సాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టుపై వైసీపీ చేస్తున్న రాద్ధాంతం అర్థరహితమని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్తీమద్యం వ్యాపారంలో వేలకోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టిన జోగి రమేశ్‌ను అరెస్టు చేయడం తగిన చర్య అని అన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైన శిక్ష అనుభవించక తప్పదన్నారు. అర్థరహిత ఆరోపణలు మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించకతప్పదన్నారు.

రేచర్ల తండాలో సీసీ రోడ్లకు నిధులు

చింతలపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేచర్ల తండాలో మండల పరిషత్ నిధుల నుంచి 15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు తెలిపారు.మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ తండాలో మరిన్ని మౌలిక సదుపాయాల కోసం జడ్పీ నిధులు 11 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు.

ఎస్.ఐ.గా వీరప్రసాద్ బాధ్యతలు



జంగారెడ్డిగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో శాంతి భద్రతలు పరిరక్షిస్తానని ఎస్.ఐ. ఎన్.వీరప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్.ఐ.గా వీరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిడమర్రు ఎస్.ఐ.గా పనిచేసిన ఈయన స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తుండగా జంగారెడ్డిగూడెం బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్.ఐ.గా పనిచేస్తున్న ఎస్.కె. జబీర్ మండలంలోని లక్కవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఆయుధ కర్మాగారం నిలిపివేయాలి

కొయ్యలగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగపేటలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రచారం జరుగుతోందని ఆ కర్మాగారాన్ని ప్రభుత్వం నిలుపుదల చేయాలని విద్యావేత్త అలుగు ఆనంద్ శేఖర్ కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద వామపక్ష నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆయుధ కర్మాగారం ఏర్పాటు చేసే గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల ఆమోదం తీసుకోవాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొగ్గవరపు బాబూరావు, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు ఆంజనేయ రాజు, ఎస్.రాంబాబు, ఎస్.కె.బాజీ, సుందరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలుగు

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు : ఎంపీడీవో

కలిదిండి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఫణీంద్ర తెలిపారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో రహదారులపై నిల్వ ఉన్న నీటిని తొలగించి డ్రెయినేజీల్లో పూడికతీతతో పాటు బ్లీచింగ్, దోమల నివారణ మందులను చల్లిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలని, పైపులైన్ల లీకేజీలు అరికట్టాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కలిదిండి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏడీ పార్వతి అన్నారు. మంగళవారం సానారుద్రవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నేలవాలిన వరి పైరు పరిశీలించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించే ధాన్యానికి డిమాండ్ ఉందన్నారు. దాళ్వాకు మినుము పంట వేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

7న రహదారి అభివృద్ధి కోరుతూ సీపీఐ పాదయాత్ర

ముసునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్ళే ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ ఈ నెల 7న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ముసునూరులో ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ రహదారి అభివృద్ధిపై వైసీపీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఇప్పటికైన ఈ రోడ్డు అభివృద్ధి చేయకుంటే నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడంతోపాటు ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పార్టీ కార్యవర్గ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ముసునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ముసునూరు మండల నూతన అధ్యక్షుడిగా జి.పద్మకిషోర్, ప్రధాన కార్యదర్శిగా గుడిమెళ్ళ రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నూజివీడులో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు సమక్షంలో జరిగిన మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నూకల శ్రీదేవి, జి.యోగిత, వింధ్య, మండల కార్యదర్శులుగా కాట్రు షామిలి, పిన్నమనేని అనూషను ఎన్నుకోవడం మహిళా ఉద్యమ స్ఫూర్తికి అద్దం పట్టినట్లు అయిందని జిల్లా అడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు అన్నారు. జిల్లా సహాయ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను లక్ష్మణరావుతోపాటు జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాలీ, రుద్రాక్షి రవికుమార్ సన్మానించారు.

జిల్లా ఖోఖో పోటీలకు ముసునూరు విద్యార్థిని



ముసునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని టి.లక్ష్మీప్రసన్న జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శైలజ తెలిపారు. ఈ నెల 3న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసాపురం జడ్పీ స్కూల్‌లో జరిగిన డివిజన్ స్థాయి ఖోఖో పోటీల్లో లక్ష్మీప్రసన్న ప్రతిభ కనబర్చి జిల్లా జట్టులో స్థానం సంపాదించినట్లు హెచ్ఎం తెలిపారు. మంగళవారం లక్ష్మీప్రసన్నను హెచ్ఎం, స్టాఫ్ సెక్రటరీ గంగుల నాగేశ్వరరావు, పీడీ హేమ, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్, చెస్ పోటీలకు ఏలూరు జిల్లా జట్లకు నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. తద్వారా రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు నక్కనబోయిన గీతిక చెస్, సాయి ప్రవీణ్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

బాలికలకు వృత్తి విద్య నైపుణ్య పోటీలు

ముసునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల పాఠశాలలో బాలికలకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం వృత్తి విద్య నైపుణ్యంపై పోటీలను నిర్వహించారు. ఒకేషనల్ ట్రైనర్ బి.తులసిబాయ్ పర్యవేక్షణలో కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలికలకు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ కుమారి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో బాలికలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఉపాధి పథకంతో గ్రామాల అభివృద్ధి

చాట్రాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంతో గ్రామాల అభివృద్ధి, కూలీలకు ఉపాధి, రైతులకు లాభం చేకూరుతుందని పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండ సచివాలయం-1లో మంగళవారం జరిగిన ఉపాధి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు పశుగ్రాసం, పండ్ల తోటలు, పంటకుంటలు తవ్వకం లాంటి పథకాలను వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ జ్యోతి, ఏపీవో లక్ష్మీకుమారి, కూటమి నాయకులు నక్కా రాము, తేనేటి వేణు, మొండ్రు సురేష్, వినంపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు. కోటపాడు సచివాలయంలోను ఉపాధి గ్రామసభ జరిగింది.

భూమి లాక్కొనేందుకు యత్నిస్తున్నారని నిరసన

నూజివీడు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలంలోని ఓ సర్పంచ్ భర్త తమ భూమి బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడంటూ జనసేన నాయకులతో కలిసి మీర్జాపురానికి చెందిన పామర్తి చిట్టిబాబు, బుచ్చిబాబు నూజివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. తమ భూమిని అమ్మేందుకు నిరాకరించడంతో మంత్రి అనుచరుడు రీసర్వేలో తమ భూమిని రికార్డుల్లోకి ఎక్కకుండా చేయడమే కాక బోర్‌కు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను కూడా తొలగించేలా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని, బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. తమకు మంత్రి సారథి న్యాయం చేయాలని జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, సునీల్‌కుమార్, ఎర్రంశెట్టి రాములతో కలిసి నిరసనకు దిగారు.

బాల్య వివాహాల నిరోధంలో కమిటీలే కీలకం

నూజివీడు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణలో కమిటీలది కీలకపాత్ర అని నూజివీడు ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్, నూజివీడు సీడీపీవో విజయ్‌కుమారి అన్నారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో వారు బాల్యవివాహాల నియంత్రణపై మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ మండలంలో గత జనవరి నుండి 10 బాల్యవివాహాలు నమోదు కాగా టీనేజ్ ప్రెగ్నెన్సీలు 48 నమోదయ్యాయన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలను గుర్తించి ఆ యువతీ యువకుల తల్లితండ్రులపై కేసులు నమోదు చేసేలా గ్రామస్థాయి కమిటీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాల్య వివాహాల నియంత్రణకు పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ అంగన్‌వాడీ తదితర శాఖలు సమష్టిగా కృషి చేయాలన్నారు. వైద్యులు సురుచి, సాయి సుధ, శ్రీనివాస్ గౌతమ్, ఎం శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో వై. శివరంగారావు పాల్గొన్నారు.

జూద గృహాలను నడిపే సంస్కృతిని అరికట్టాలి

ఆగిరిపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూద గృహాలను నడిపే సంస్కృతిని అరికట్టాలని మండల జూద గృహాల వ్యతిరేక కమిటీ తెలిపింది. పోతవరపాడు గ్రామ పరిధిలో గల రిక్రియేషన్ క్లబ్ గతంలో సాంస్కృతిక క్లబ్ ముసుగులో పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండగా ఆగిరిపల్లి పోలీసులు దాడి చేసి సదరు క్లబ్ మూసివేయించారని, ప్రస్తుతం క్లబ్‌కు కోర్టు అనుమతి ఇవ్వడంతో మరలా సదరు క్లబ్ కార్యకలాపాలు ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మంగళవారం క్లబ్ వద్ద ధర్నా నిర్వహించామని తెలిపారు. కలెక్టర్, నూజివీడు సబ్ కలెక్టర్ దీనిపై చర్య తీసుకోవలసిందిగా కోరారు. జూద గృహాల వ్యతిరేక కమిటీ సభ్యులు ఎం అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



నూరంపాలెం పెట్రోల్ బంక్ వద్ద డేంజర్ స్పాట్



ఉప్పరగూడెం వద్ద ప్రమాదకరంగా మలుపు



కలిదిండి ఇందిరా కాలనీ వద్ద ప్రమాదకర మలుపు



ఆగిరిపల్లిలో ప్రమాదకర మలుపు

డేంజర్ ROADS

» రహదారులపై ప్రమాద మలుపులు, డేంజర్ స్పాట్లు » ప్రాణాలుపోతున్నా నివారణ చర్యలేవీ?

రోడ్డు ప్రమాదాల్లో పలువురు అసువులు బాస్తున్నారు. రహదారులపై పలు మలుపులు ప్రమాదకరంగా మారి ప్రయాణికుల ఉసురు తీస్తున్నాయి. కొన్నిచోట్ల సరైన హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడ్ బ్రేకర్లు గానీ లేక పోవడం.. మలుపుల్లో పెరిగిన చెట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత అయినా అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.. పలు ప్రాంతాల్లోని బ్లాక్ స్పాట్‌లు ఇవీ..

చాట్రాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో చాట్రాయి మండలం నూరంపాలెం పెట్రోల్ బంకు, సబ్ స్టేషన్ వద్ద డేంజర్ స్పాట్లు వాహనచోదకులను భయపెడుతున్నాయి. పెట్రోలు బంకు వద్ద రెండేళ్ళ క్రితం లారీ ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురు చనిపోయారు. సబ్ స్టేషన్ వద్ద ఏడాది క్రితం చిన్నకారు కల్వర్టును ఢీకొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. తరువాత ఇక్కడే రెండు బైక్ యాక్సిడెంట్లు జరిగి ఇద్దరు యువకులు చనిపోయారు. ఈ రెండు స్పాట్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు రక్షణ చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకున్న తరువాత వాహనచోదకులు వేగంగా రహదారిపైకి వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సబ్‌స్టేషన్ వద్ద రహదారి కొద్దిగా వంకర ఉంది. వాహనచోదకులు రోడ్డు తిన్నగా ఉందనుకొని వచ్చి రహదారి ఒంపులో కల్వర్టు గోడను ఢీ కొడుతున్నారు. ఇక్కడ రోడ్డు డిజైన్‌లో లోపం ఉన్నదని అందుకే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ రెండు చోట్ల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చెయ్యాలని ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రెండు చోట్ల ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి నుంచి బంటుమిల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఉప్పరగూడెం గ్రామం వద్ద మలుపులు, పెదలంక మేజర్ డ్రెయిన్‌పై వంతెన రెయిలింగ్స్ విరిగి ప్రమాదకరంగా మారాయి. గ్రామ సమీపంలోని మలుపులో రహదారి డ్రెయిన్ నీటి ప్రవాహానికి కోతకు గురికావటంతో వాహనాలు తప్పుకునే అవకాశం లేకుండాపోయింది. తరచూ ఈ మలుపులో లోడు వాహనాలు బోల్తా పడుతున్నాయి. అదే గ్రామం వద్ద మరో మలుపులో చెట్లు పెరిగి ఒక వైపు నుంచి వచ్చే వాహనాలు మరోవైపు కనిపించవు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఎప్పుడో ఒకసారి చెట్లను తొలగిస్తుండగా, ఉప్పరగూడెం గ్రామస్థులే ఎక్కువ సార్లు ఆ మలుపుల్లోని చెట్లను స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. పెదలంక డ్రెయిన్‌పై వంతెన రెయిలింగ్స్ విరిగి ఎనిమిదేళ్లు గడిచినా నేటికీ అధికారులు వాటిని పునరుద్ధరించకపోవటంతో డేంజర్ స్పాట్‌గా మారింది.

కలిదిండి: కలిదిండి-వెంకటాపురం రహదారిలో ఇందిరా కాలనీలో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. గత పదేళ్లలో సుమారు 15 మంది మృతి చెందగా, పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే మద్వానిగూడెం - కొండంగి ఉప్పుటేరు వెంబడి రహదారిపై గత ఐదేళ్లలో 10 మందికి మృతి చెందారు. ఈ రోడ్డుకు మార్జిన్ లేకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురై చనిపోతున్నారు. ఇందిరా కాలనీ మలుపు, మద్వానిగూడెం - కొండంగి రహదారిలో పుట్ట వద్ద డేంజర్ స్పాట్‌గా గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగిరిపల్లి: విజయవాడ వెళ్ళే ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి రామాలయం వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. పక్కనే డ్రైనేజీ ఉండటంతో రోడ్డు మలుపులో ఆకస్మికంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేనందున మలుపు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

ఆగిరిపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ గోళ్ళ అనూష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనూష అధ్యక్షతన ఎంపీడీవో బి. భార్గవి ఆధ్వర్యంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు. ఏవో భవాని మాట్లాడుతూ తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పంట నష్టం నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. హెక్టారుకు వరి, ప్రత్తి పంటలకు రూ.25 వేలు, మినుముకు రూ.15 వేలు నష్టపరిహారం వారి బ్యాంకు అకౌంట్లలో జమవుతాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదిక వివరాలను సభలో చదివి వినిపించారు. మండలంలోని పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా వెంటనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, వైస్ ఎంపీపీ కె. రమేష్, జడ్పీటీసీ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

మండవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన, బదిలీపై వెళ్లిన వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. అఖిల శ్రావణి ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్ట్ సాధించగా, హోంగార్డుగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించారు. మండవల్లి నుంచి కలిదిండి పీఎస్‌కి వెళ్లిన సింగంశెట్టి శ్రీకాంత్ వీరి ముగ్గురికి మండల ఎస్సై రామచంద్రరావు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

టీడీపీ కల్చరల్ సెల్ మండల అధ్యక్షుడిగా సుధాకరరావు

చాట్రాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కల్చరల్ సెల్ చాట్రాయి మండల అధ్యక్షుడిగా పోతనపల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సుధాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి పార్థసారథి సుధాకరరావుకు నియామక పత్రం అందజేశారు. మంత్రి పార్థసారథికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనతోనే రోగం మాయం : మంత్రి డోలా



నర్సుల శిక్షణలో మాట్లాడుతున్న మంత్రి డోలా

ఆగిరిపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నివారణే ఉత్తమ వైద్యం అనే భావనను నర్సులు రోగులకు అవగాహన కలిగిస్తే రోగం మాయమౌతుందని రాష్ట్ర సామాజిక, వృద్ధుల సంక్షేమ మరియు సచివాలయ శాఖల మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. తోటపల్లిలోని హీల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన సమగ్ర పాఠశాల ఆరోగ్య, వెల్‌నెస్ కార్యక్రమంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులాలకు చెందిన 170 మంది నర్సులకు శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని, విద్యార్థుల తల నుంచి కాలి వరకు ఆరోగ్య పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ఏపీఎస్‌డబ్ల్యూఎస్ఆర్ఈఐఎస్ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. యూనిసెఫ్ ఆరోగ్య నిపుణులు సలీమా తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాలు నిర్మించుకోండి

చాట్రాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) మండలంలో లేఅవుట్ కాలనీలలో ఇళ్ళ స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులు పక్కా ఇళ్ళు నిర్మించుకోవటానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ కోరారు. మండలంలోని చాట్రాయి, జనార్ధనవరం, చిత్తపూరు గ్రామ సచివాలయాలలో మంగళవారం హౌసింగ్ గ్రామసభలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఇళ్ళు కట్టుకునే లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కి రూ 1.80 లక్షలు బిల్లులు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని దీనిని లబ్ధిదారులు అందరూ వినియోగించుకొని సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లో దామెర ఉష, పామర్తి ఝూన్సీరాణి, తిరువీధి రమేష్, ఎంపీటీసీ సంకు శివకుమారి, కూటమి నాయకులు తుమ్మల జగన్, ఆదిమూలం శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్‌పై ప్రచారానికి శ్రీకారం

ముదినేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని ముదినేపల్లిలో మంగళవారం ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా కో కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు ఆత్మనిర్భర్ భారత్ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు నాయకులు, కార్యకర్తలు ఇంటింటా విస్తృతప్రచారం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏసుబాబు, పార్టీ నాయకులు పుసుపులేటి నరసింహారావు, వత్తుమిల్లి ప్రసాద్, మేలిమి చిట్టిబాబు, పాండురంగారావు, కొల్లిపర నాగరాజు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోళ్ల మోహనరావుకు మాతృవియోగం



అనసూయమ్మ (ఫైల్)

చాట్రాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామానికి చెందిన వ్యాపార ప్రముఖుడు గోళ్ళ మోహనరావు మాతృమూర్తి అనసూయమ్మ(86) వృద్ధాప్య సమస్యలతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మనుమడి ఇంట్లో మృతి చెందారు. మంగళవారం ఉదయం ఆమె భౌతికకాయాన్ని చాట్రాయిలోని స్వగృహానికి తీసుకు వచ్చారు. పలు గ్రామాల వైశ్య ప్రముఖులు, నాయకులు అనసూయమ్మ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మంగళవారం చాట్రాయిలో అంత్యక్రియలు జరిగాయి.

జేవీవీ స్టడీ మెటీరియల్ వితరణ

నూజివీడు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నిర్వహించే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఉపయోగపడే మెటీరియల్‌ను నూజివీడు మండలం మద్దాయికుంట జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ లక్ష్మణ్‌రావు తయారు చేసిన మెటీరియల్‌ను హెచ్ఎం, జేవీవీ సభ్యుడు దారపురెడ్డి భాస్కరరావు విద్యార్థులకు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

ద్వారకాతిరుమల, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామికి మంగళవారం లెక్కించిన హుండీ ఆదాయం భారీ సమకూరింది. 41 రోజుల కాలానికి నగదు రూ రూ.4.22 కోట్లు ఆదాయం లభించినట్లు ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. 4,22,31,799 రూపాయల నగదుతో పాటు 569 గ్రాముల బంగారం, 7.708 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (30), 1000 (20), 2000(3)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.



హుండీలో టాయ్ కరెన్సీ!

సాక్షాత్తూ వడ్డీ కాసుల వెంకన్నకు సైతం టాయ్ కరెన్సీ తాకిడి తప్పలేదు.. హుండీలలో టాయ్ కరెన్సీ నోట్లు రావడం కలకలం రేపింది. స్వామివారి హుండీలో టాయ్ కరెన్సీ కనుగొన్న అధికారులు, సిబ్బంది ఉలిక్కి పడ్డారు. మంగళవారం ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో రూ.500 కట్ట (100 నోట్లు)ఒకటి అనుమానంగా ఉండడంతో అధికారులు పరిశీలించి అవి టాయ్ కరెన్సీగా గుర్తించారు. ఈ నోట్లను హుండీలో ఎవరు వేశారనేది విచారణ జరపాల్సి ఉంది. హుండీల్లో ఇలా నకిలీ లేదా బొమ్మ కరెన్సీ వేయడం చట్టరీత్యా నేరం. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హుండీలో లభించిన ఇటువంటి కరెన్సీని దర్యాప్తు నిమిత్తం సాధారణంగా పోలీసులకు అప్పగిస్తారు.

నూజివీడు గోడు

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గం ఏ జిల్లాలో కలుస్తుందనే దానిపై ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అతిపెద్ద డివిజన్

నూజివీడు డివిజన్‌ను ఏలూరు జిల్లా పరిధిలోకి తీసుకోవడంతో డివిజన్‌లోని 14 మండలాల్లో 10 కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విలీనమయ్యాయి. తిరువూరు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కాగా నూజివీడు కేంద్రంగా కేవలం నాలుగు మండలాలు మాత్రమే మిగలడంతో ఇక్కడ వున్న ప్రధాన శాఖల కార్యాలయాలు ఏలూరు జిల్లా కేంద్రానికి తరలిపోయాయి. చివరికి నూజివీడు డీఎస్పీ కార్యాలయం తరలిపోయే పరిస్థితిని నాటి డీఎస్పీ అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుకు వివరించగా ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏలూరు డివిజన్ పరిధిలోని పెద వేగి, పెదపాడు పోలీస్ స్టేషన్‌లను నూజివీడు డీఎస్పీ కార్యాలయ పరిధిలోకి తీసుకొచ్చారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చింతలపూడి, లింగపాలెం మండలాలను తీసుకొచ్చారు. నూజివీడు డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రానికి తరలిపోయాయి.

మూడు డివిజన్‌లుగా మారుస్తున్నారా ?

ప్రస్తుత జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఇప్పటికే ఎన్.టి.ఆర్ జిల్లాలో ఉన్న తిరువూరు డివిజన్‌తోపాటు తాజాగా గన్నవరం డివిజన్‌గా మార్చి ఈ 14 మండలాలను మూడు డివిజన్‌లుగా ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నూజివీడు డివిజన్‌ను గత ప్రభుత్వం అశాస్త్రీయంగా విభజించగా దాన్ని సరిచేసి నూజివీడు డివిజన్‌కు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి



నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి. రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న నూజివీడు స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. పరిశ్రమల స్థాపన, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఏర్పాటు చేయటానికి రాజధాని ప్రాంతంపై ఒత్తిడి తగ్గుతుంది. అదేవిధంగా జాతీయ రహదారులు, రైల్వే, విమానయాన సౌకర్యాలకు నూజివీడు నియోజకవర్గం దగ్గరలో ఉంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంగా నూజివీడు నియోజకవర్గం విస్తరించి ఉండటం కూడా రాజధానికి కలిసి వస్తుంది.

-మల్లిపూడి రాజశేఖర్, బీజేపీ నాయకుడు

హామీని అమలుచేయాలి



నూజివీడు ప్రజల సెంటిమెంట్ గుర్తించి ఎన్నికల సమయంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ కేంద్రంగా ఉన్న జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. హామీ మేరకు విజయవాడ కేంద్రంగా ఉన్న జిల్లాలో నూజివీడు కలిపి స్థానిక ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి.

-ఇందుపల్లి సత్యప్రకాష్, బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు, నూజివీడు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలను వేగవంతం చేసింది. దాదాపు ఈ ప్రక్రియలు పూర్తయ్యాయి. గత ఇబ్బందులు పునరావృతం కాకుండా ఈసారి కొనుగోళ్లను సమర్థవంతంగా చేయాలని నిర్ణయించారు.

ధాన్యం కొనుగోళ్లపై జేసీ సమీక్ష

ధాన్యం కొనుగోలుపై జేసీ ఎంజె అభిషేక్‌గౌడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో వారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 108 రైస్ మిల్లుల్లోని 85 లక్షల గోనె సంచుల్లో 60 లక్షల సంచులు బాగున్నాయని, మిగతా 25 లక్షల సంచులు ఒకటికి రెండుసార్లు పరిశీంచుకుని చిన్నచిన్న చిరుగులు ఉంటే కుట్టి సిద్ధం చేయాలన్నారు. రైతులకు మాత్రం నాణ్యమైన గోనె సంచులు మాత్రమే ఇవ్వాలన్నారు. బ్యాంకు గ్యారెంటీలు, సిద్ధం చేసుకోవాలని రైస్‌మిల్లర్లకు చెప్పామన్నారు. హమాలీలు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వెను వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ధాన్యం రవాణాలో లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్లు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని జేసీ పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం అవుతాయిని ఆయన పేర్కొన్నారు.

క్రైమ్ కార్నర్

బస్సు దిగుతూ పడిపోయిన వృద్ధురాలు మృతి

ముదినేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో గత నెల 30న ఆర్టీసీ బస్సు నుంచి దిగుతూ జారిపడిపోయిన కోడూరు విజయలక్ష్మి (69) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మరణించింది. విజయవాడ పెళ్లికి వెళ్లి తిరిగి వస్తూ ఆమె గుడివాడలో ఆర్టీసీ బస్సు ఎక్కి గురజ రోడ్డు సెంటర్‌లో దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారిపడిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108లో గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. కేసు నమోదు చేసి ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ప్రదీప్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముదినేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన మహిళ భర్త మరణించడంతో ముదినేపల్లిలోని ఒక హోటల్‌లో పని చేస్తూ జీవిస్తోంది. ఆమెకు కోమర్రుకు చెందిన పీవీ సూర్యనారాయణతో పరిచయం ఏర్పడడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఏడాదిగా సూర్యనారాయణ తాగి వచ్చి వేధిస్తున్నాడని, ఈ నెల 2న తనను కర్రతో తీవ్రంగా గాయపర్చాడని సోమవారం రాత్రి బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.